

ఐటీఐకి దరఖాస్తుల ఆహ్వానం

భైంసా రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాటేగాం గ్రామ సమీపంలో ఉన్న సరస్వతి ఐటీఐ కళాశాలలో దరఖాస్తులు ప్రారంభమయ్యా యని కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ తెలిపారు. పదోతరగతి పాస్ అయిన అభ్య ర్థులు ఈ నెల 2వ తేదీ నుంచి 21 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసు కోవాలని కోరారు. ప్రతిఒక్కరూ ఒరిజినల్ సర్టిఫికెట్ స్కాన్‌చేసి వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. పదోతరగతిలో మార్కుల రూల్ రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక జరుగుతుందన్నారు.

సంక్షేమం, అభివృద్ధిలో..
తెలంగాణ దేశంలోనే ఫస్ట్

- అన్ని వర్గాలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం
- ఏడాదిన్నర కాలంలో కోట్ల రూపాయల వ్యయం
- తెలంగాణ ఆవిర్భావ వేడుకల కార్యక్రమంలో స్టేట్ ఫైనాన్స్ కమిషనర్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య



కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

మాట్లాడుతున్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

నిర్మల్/నిర్మల్ రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమం, అభివృద్ధి పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి వరుసలో నిలుస్తోందని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి అమరవీరులకు నివాళుల ర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్ని వర్గాల అభ్యున్నతికి తోడ్పడుతున్నాయన్నారు. రైతుభరోసా, రుణమాఫీతో రైతులకు పెద్ద ఎత్తున చేయూతనందించామన్నారు. ధాన్యం, పంట కొనుగోళ్లను పెద్ద ఎత్తున పూర్తి చేయబోతున్నట్లు వెల్లడించారు. రాజీవ్ యువ వికాసం పథకం వేలాది మంది యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించబోతుం దన్నారు. ప్రభుత్వం అధికారంలో వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు వెల్లడించారు. గతంలో ధరణి ద్వారా రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ధరణిని పక్కన పెట్టి భూ భారతిని అమలులోకి తెచ్చిందన్నారు. భూ భారతి ద్వారా ఇక నుంచి రైతులకు భూములకు సంబంధించిన సమస్యలు ఏర్పడబోవు అన్నారు. భూముల లెక్క ఇక పక్కాగా ఉంటుందన్నారు. అధికారులు సమన్వయ ంగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నింటినీ అర్హులైన వారికి అందేటట్లు చేయడంలో సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు మరింతగా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా రైసింగ్ తెలంగాణ సాధ్యం కాబోతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాతనే ఈ ప్రాంత ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం లభించిందని ఈ స్వాతంత్ర్య ఫలాలు ప్రతి పేద వర్గానికి అందాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలను ప్రదర్శించి అలరించారు. ఆ తర్వాత విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అలాగే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ సహకారంతో రైతులకు విత్తన ఉత్పత్తి కోసం నాణ్యమైన ఫౌండేషన్ విత్తనాలను ఉచితంగా అందజేశారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లను చైర్మన్, జిల్లా కలెక్టర్, ఎస్పీ అధికారులు ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల, జిల్లా అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులతో కళాజాతా ప్రదర్శనల ద్వారా మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, వయోవృద్ధుల సంక్షేమ చట్టాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, బాలల చట్టాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ ద్వారా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా కళాశాలలు, విద్యాసంస్థలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు తనిఖీల వివరాలను వెల్లడించారు. ఈ వేడుకల్లో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పుర ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- బీజేఎల్పీనేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



విత్తనాలు పంపిణీ చేస్తున్న బీజేఎల్పీనేత మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని బీజేఎల్పీనేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని చిట్యాల గ్రామంలో బీజేఎల్పీనేత, ఎమ్మెల్యే టీఎస్ సీడ్ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి, జీలుగ సహా తదితర విత్తనాలను రైతులకు అందజేశారు. రైతులు మేలు రకమైన విత్తనాలను నాటి లబ్ధిపొందాలని సూచించారు. రైతులను అన్ని విధాల ఈ ప్రభుత్వం మోసగిస్తుందని, వడ్ల కొనుగోలులో గత ప్రభుత్వం మాదిరి ఈ ప్రభుత్వం కూడా దోపిడీకి పాల్పడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మె రాజు, జమాల్, సరికెల గంగన్న, మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి, నాయకులు అనిల్, సత్యం చంద్రకాంత్, మౌలానా, సాయిరెడ్డి, హుస్సేన్, రమేష్ పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి ఆత్మహత్య

ముథోల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని బ్రహ్మాన్‌గాం గ్రామానికి చెందిన జౌల పోతన్న(58) అనే వ్యక్తి మద్యానికి బానిసై చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ముథోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... మృతుడు తన ఇంటి నుంచి ఆదివారం సాయంత్రం వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు గాలించగా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం స్థానిక చెరువు గట్టు మీద మృతుడికి సంబంధించిన వస్తువులు కనిపించడంతో కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. చెరువులో వెతకగా మృతదేహం దొరకడంతో బయటకు తీశారు. అనంతరం భైంసా ఆసుపత్రికి పోస్టుమార్టానికి తరలించారు. మృతుడు మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ముథోల్ విద్యార్థి ప్రతిభ



స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

ముథోల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : సోమవారం వెలువడిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మండల కేంద్రమైన ముథోల్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులైన పోతుల్‌వార్ సురేష్ - స్వప్న దంపతుల కుమారుడు పోతుల్‌వార్ సృజన్ కుమార్ అనే విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయస్థాయిలో ఓబీసీ 149వ ర్యాంక్ సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అలాగే ఓపెన్ విభాగంలో 930 ర్యాంక్ సాధించి ఐఐటీలో చేరేందుకు అర్హత సాధించాడు. దీంతో తల్లిదండ్రులు, పలువురు విద్యార్థికి అభినందించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 137వ ర్యాంకు



రుతిక్‌కుమార్

కుంటాల, జూన్, 2 (ఆంధ్రజ్యోతి) : సోమవారం విడుదలైన జేఈ ఈ అడ్వాన్స్‌డ్‌లో (ఐఐటీ) ప్రవేశ పరీక్షలో కుంటాలకు చెందిన రుతిక్ కుమార్ ఆలిండియా ఓబీసీ కేటగిరిలో 137వ ర్యాంకు సాధించాడు. ఇతని తండ్రి సంజీవ్ కుమార్ డీఆర్‌డీఏ కార్యాలయంలో టీఏగా విధులు నిర్వహిస్తుండగా తల్లి చింతప్రభ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు.

ఈద్గాలో పారిశుధ్య పనులు



పనులను పరిశీలిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్

ఖానాపూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని ఈద్గాలో మున్సిపల్ అధికారులు సోమవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ పనులను మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, జామ మస్జిద్ అధ్యక్షుడు జహీర్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషాలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం మాట్లాడుతూ... బక్రీద్ పండుగకు ఎటువంటి చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల, పట్టణాధ్యక్షులు సలీం ఖాన్, షౌకత్ పాషా, ఏజీపీ ఆసిఫ్ అలీ, జామ మస్జిద్ ఉపాధ్యక్షుడు ముషీర్, జియా, మున్సిపల్ అధికారి సురేందర్, సిబ్బంది శంకర్, తదితరులున్నారు.

విధులను సక్రమంగా నిర్వహించాలి

- ఎస్పీ జానకీ షర్మిల



సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

సారంగాపూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : సరిహద్దు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సక్రమంగా విధులను నిర్వహించాలని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. సోమవారం మండలంలో గల రామ్‌సింగ్ తండా, సమీపంలో గల తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దులో గల గోవుల అక్రమ రవాణాను అరికట్టడానికి ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసి చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో గోవుల అక్రమ రవాణాకు అరికట్టడానికి రాష్ట్ర సరిహద్దులో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, పర్యవేక్షణలో వుండే విధంగా ప్రత్యేక చెక్‌పోస్టులలో పోలీస్ సిబ్బందితో పాటు పశుసంవర్ధక శాఖ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈమె వెంట ఎస్సై శ్రీకాంత్‌లు న్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

- ఎంఈవో శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

దిలావర్‌పూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల విద్యాధికారి కే.శంకర్ అన్నారు. దిలావర్‌పూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన గ్రామస్థులు, గ్రామాభివృద్ధి కమిటీసభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వపాఠశాలల్లో విషయ పరిజ్ఞానం, సబ్జెక్టులపై మంచి పట్టు ఉన్న ఉపాధ్యాయులు ఉంటారన్నారు. ఎంతో నైపుణ్యం, అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలను కాదని ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపితే ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతామన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని వెలికి తీసి ప్రతిభలో మెరికల్లాంటి విద్యార్థులను తీర్చిదిద్దడంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకే సాధ్యమన్నారు. అన్ని రకాల శిక్షణ తీసుకున్నాకే ప్రభుత్వ ఉపాధ్యాయు లుగా నియమిస్తారని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని మౌలికసదుపాయాలు కల్పిస్తోందని, దిలావర్‌పూర్ ఉన్నత పాఠ శాలలో ఇప్పటికే కంప్యూటర్ ల్యాబ్‌సౌకర్యం ఉందని, సైన్స్ ల్యాబ్ నిర్మాణం జరుగుతుందని చెప్పారు. మీ అందరూ సహకరిస్తేనే విద్యార్థుల సమగ్ర అభివృద్ధి సాధ్య మవుతుందన్నారు. ఈ సందర్భంగా మా పిల్లలతో పాటు ఇతరుల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి అందరం కృషి చేస్తామని గ్రామస్థులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధా నోపాధ్యాయుడు సదానందం, ఉపాధ్యాయులను అభినందించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు సదానందం, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ దొంగల ముఠా అరెస్ట్



దొంగల ముఠాతో పోలీసులు

నిర్మల్ అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ద్విచక్రవాహనాలను చోరీచేసిన ముఠాను నిర్మల్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్నారు. దీంతో పోలీసులను జిల్లా ఎస్పీ జానకిషర్మిల అభినందించారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలోని హిమాయత్‌నగర్‌కి చెందిన జాదవ్ గంగాధర్, గణేష్ కాల్బాందే, దిగంబర్ బందర్వార అనే ముగ్గురు ముఠాగా ఏర్పడ్డారు. వచ్చిన డబ్బులు జల్సాలకు ఖర్చు చేసే వారు. కానీ ఆ డబ్బులు సరిపోవడం లేదని అందుకు వారు సులభంగా డబ్బులు సంపాదించాలని బైకులు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. బైక్‌లు దొంగతనం చేసి, గుర్తు తెలియని వ్యక్తులకు అమ్ముకొని వచ్చిన డబ్బులతో జల్సాలు చేయాలని నిర్ణయించుకున్నారు. వారు గతంలో బైక్‌ల చోరీలు చేసిన చోట మళ్లీ మళ్లీ దొంగతనాలు చేస్తే దొరికిపోతారనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చారు. జాదవ్ గంగాధర్ అనే వ్యక్తి గతంలో జీవనోపాధి కోసం నిర్మల్‌కి వచ్చి మేస్త్రీ పని చేయడం ద్వారా ఈ ప్రాంతం అతనికి తెలుసు. తన ఇద్దరు ఫ్రెండ్స్‌ని నిర్మల్‌కి తీసుకురాగా ముగ్గురు కలిసి నిర్మల్‌లోని వివిధ ప్రాంతాల్లో డమ్మీ తాళం చెవిని ఉపయోగించి 8 మోటార్ సైకిళ్లను చోరీ చేశారు. 8 మోటార్ సైకిళ్లను నేరస్తులు అమ్ముకునేందుకు బంగల్‌పేట్ శివారులో ఉంచారని సమాచారం రాగా నిర్మల్ ఇన్‌స్పెక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్ సిబ్బందితో వెళ్లి 8 బైక్‌లతో సహా ముగ్గురు నేరస్తులను పట్టుకొని రిమాండ్‌కి తరలించారు. నిందితులను పట్టుకోవడంలో, విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ కుమార్, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ సమ్మయ్య, ఆర్ఎస్సై సాయికృష్ణ, సీసీఎస్ కానిస్టేబుల్‌లను నిర్మల్ ఎస్పీ డా.జీ. జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు.

సాకెరలో ఘనంగా భీమన్న జాతర



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

సోన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాకెర గ్రామంలో భీమన్న జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. పవిత్ర గోదావరి జలాలతో భీమన్న దేవుడి గజాలను శుద్ధి చేసి ఆలయంలో ప్రతిష్టిం చారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలను చల్లగా చూడాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. ఇందులో ఆదివాసి నాయక్‌పోడ్ కులస్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



పట్టుకున్న కలప ట్రాక్టర్‌తో పోలీసులు

- ట్రాకర్ సీజ్, కేసు నమోదు
- రూ. లక్షా 16వేల జరిమానా

సారంగాపూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గల లింగాపూర్ సమీపంలో గల అటవీ ప్రాంతం నుంచి శనివారం రాత్రి ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు అటవీ శాఖ అధికారి రామకృష్ణరావు తెలిపారు. అటవీశాఖ అధికారుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత రెండు రోజుల క్రితం లింగాపూర్ నుంచి స్వర్ణ గ్రామానికి అక్రమంగా కలపను ట్రాక్టర్‌లో తరలిస్తున్న సమాచారాన్ని అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి వెళ్లారు. 15టేకు కలప టేకు దుంగలను పట్టుకొని ట్రాక్టర్‌ను సీజ్ చేసి రూ. లక్షా 16వేలను జరిమానా విధించినట్లు వెల్లడించారు. ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు అక్రమంగా కలపను తరలిస్తున్న కూలీలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న 15 టేకు దుంగలతో పాటు ట్రాక్టర్‌ను విచారణ నిమిత్తం కోసం నిర్మల్ పట్టణంలో గల అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు మహ్మద్ నజీర్‌ఖాన్, వెన్నెల బీట్ సంతోష్, భూమేష్‌లున్నారు.

ఖానాపూర్ ప్రాంతంపై నిర్లక్ష్యం వీడాలి

- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆకుల శ్రీనివాస్



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు

ఖానాపూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ ప్రాంతంపై నిర్లక్ష్యం వీడేలా ఇప్పటికైనా పాలకులకు కనువిప్పు కలగాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్‌సభ్యులు ఆకుల శ్రీనివాస్ అన్నారు. ఇటీవల ప్రభుత్వం నుంచి ఖానాపూర్ నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఖానాపూర్ నుంచి ఉట్నూర్ తరలించొద్దంటూ సోమవారం ఖానాపూర్‌లో బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్‌లోనే అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సంవత్సరాలు అవుతున్నా నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్ గాని, మండలం గాని ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు నాటి నేటి పాలకులు ఖానాపూర్ ప్రాంతానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఖానాపూర్ మండలంలోని మేడంపెల్లి అడవుల్లో నిర్మించాల్సిన సదర్మాట్ బ్యారేజీని నిర్మల్ నియోజకవర్గానికి తరలించారన్నారు. రోడ్డు వెడల్పు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం, పశువుల దవాఖాన నిర్మాణం, రెంకోని వాగుపై రెండు బ్రిడ్జీల నిర్మాణం విషయంలో పనులు ముందుకు సాగక పరిస్థితి ఉందన్నారు. ఇక నాటి నేటి ప్రభుత్వాలు హామీ ఇచ్చిన రెవెన్యూ డివిజన్, డిగ్రీ కళాశాల ఊసే లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఖానాపూర్ నియోజకవర్గంలో నిర్మించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం రూ. 200ల కోట్లు మంజూరు చేస్తే ఇప్పుడు ఆ పాఠశాలను కూడా ఉట్నూర్ తరలించడం ఎంతవరకు సమంసజం అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్, మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్, పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్, బీజేపీ నాయకులు రమేష్, సురేందర్, లింబాద్రి, రవీందర్‌రెడ్డి, సుమంత్, పవన్, మహేందర్, శేఖర్, శ్రావణ్, తదితరులున్నారు.

భూ భారతి రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

దిలావర్‌పూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ కోరారు. ఈ నెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రామాల వారీగా నిర్వహించే రెవెన్యూ సదస్సుల వివరాలను సోమవారం విడుదల చేశారు.

20 రెవెన్యూ గ్రామాలు...

రెండు బృందాలు...

మండలంలో 20 రెవెన్యూ గ్రామాలకు గాను భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు రెండు అధికార బృందాలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలోని మొదటి బృందం ఈ నెల 3న సిర్గాపూర్, 4న మాయపూర్, 5న కాల్వ, 6న న్యూ లోలం, 10న బన్సపల్లి, 11న సాంగ్వి, 12న కంజర్, 13, 17 తేదీల్లో దిలావర్‌పూర్‌లలో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించనుంది.

రెండో అధికార బృందం...

డిప్యూటీ తహసీల్దార్ రమేష్ ఆధ్వర్యంలో రెండో బృందం 3న గుండంపల్లి, 4న సముందర్‌పల్లి, 5న రత్నాపూర్(కే), కొత్తూర్, అర్లి(బి), చింతకుంట, 6న మల్లాపూర్, 10న పొట్టపల్లి(కే), సిద్దులకుంట, ముజ్గి, 11న కదిలి, 12న మాడేగాం గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ వెల్లడించారు.

నర్సాపూర్(జి): మండలంలోని అన్ని గ్రామాల్లో జూన్ 3, మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. సదస్సులు నిర్వహించే గ్రామాలు ఈ నెల జూన్ 3న దర్యాపూర్, నందన్, 4న చర్లపల్లి, బూరుగుపల్లి(కే), 5న కుస్లి, బూరుగుపల్లి(జి), 6న నర్సాపూర్(జి), శాఖాపూర్, బామ్ని(బి), 9న నసీరాబాద్, అంజని, తురాటి, అర్లి(కే), 10న రాంపూర్, చాక్‌పల్లి, మొత్కపల్లి, డొంగుర్‌గాం, 11న టెంబుర్ని, గొల్లమాడ, వెలుగుదారి, టేకుల్ పహాడ్ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సదస్సులు జరుగుతాయని శ్రీకాంత్ పేర్కొన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన తర్వాత రసీదు ఇవ్వాలని ఆయన సూచించారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

వీధి వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తా

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న స్ట్రీట్ వెండర్స్ నిరసన దీక్ష శిబిరాన్ని సోమవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ఆలీ సందర్శించారు. గత 13 రోజుల నుంచి దీక్షలు చేపడుతున్నామని వీధి వ్యాపారులు ఆయన దృష్టికి తీసుకుకెళ్లారు. అధికారులు కేటాయించిన తాత్కాలిక స్థలంలో వ్యాపారాలు నడవడం కష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ సలహాదారు సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

'నకిలీ విత్తనాల బారిన పడకుండా.. అధికారులు చూడాలి'

బోథ్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సీజన్ ప్రారంభానికి అంటే ముందుగానే నకిలీ విత్తనాలు పట్టుబడుతున్నాయని రైతులు నకిలీ పత్తి విత్తనాల బారిన పడకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ప్రభుత్వపరంగా సరఫరా అయిన కంది పంట విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందులో మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, సదర్ మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తిరుమల గౌడ్, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, నాయకులు తాహెర్‌బిన్ సలాం, డాక్టర్ స్వామి, అల్లకొండ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాల నూతన భవనాన్ని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సోమవారం ప్రారంభించారు. నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆయన కోరారు. పాఠశాల యజమాని పచ్చిపాల సంతోష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బేల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కులను సోమవారం ఆయన లబిదారులకు అందించారు. మండలంలో పర్యటించిన ఆయన పిట్ గావ్ మాజీ సర్పంచ్ జాదవ్ సీతారామ్‌కు మంజూరైన 60 వేల చెక్కును ఆయన నివాసానికి వెళ్లి అందించారు.

అలాగే, మండలంలోని అవల్‌పూర్ గ్రామాన్ని సోమవారం ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి సందర్శించారు. గ్రామస్థులు పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పాలికారు. గ్రామంలోని పోచమ్మ ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు : ఆడె

నేరడిగొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): విడతల వారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతాయని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హనుమాన్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం భూమి పూజ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, యండి సద్దాం, కపిల్ జాదవ్, కుంట శంకర్ ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జొన్నలు అమ్మిన రైతులకు..

వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి

● సుంకిడిలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

తలమడుగు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిడి అంతర్ రాష్ట్ర రహదారిపై తలమడుగు, తాంసి మండలాల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కొనుగోలు చేసిన జొన్న డబ్బులను వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపగా ఎక్కడికక్కడ వాహనాలు నిలిచి పోవడంతో రూరల్ సిఐ ఫణిందర్ సంఘటన స్థలానికి చేరుకొని, నిరసనకారులను రోడ్డు కాలి చేయించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన జొన్నల డబ్బులు నెల రోజులు అవుతున్నా.. ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేయకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఖరీఫ్ సాగు కోసం రైతులు జొన్న డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారని, దళారీల దగ్గర విత్తనాలు ఎరువులు తెచ్చుకొని ఆర్థికంగా నష్టపోతారని, రైతు భరోసా ఇస్తామని మూడుసార్లు ఎగ్గొట్టిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు, వెంటనే జొన్న డబ్బులు రైతుల ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెండు మండల కన్వీనర్‌లు తోట వెంకటేష్, రమణ, కృష్ణ, పిఎసిఎస్ సహకార సంఘం ఛైర్మన్ వెలమ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు మొట్టే



ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను సముదాయిస్తున్న సీఐ ఫణీంధర్

కిరణ్ కుమార్, నాయకులు ఆశన్న యాదవ్, కేదారేశ్వర రెడ్డి, సుదర్శన్ రెడ్డి, తోట ప్రమోద్, రాంకిషన్ జనార్ధన్, తోట శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, మహేష్, నర్సింలు, ముచ్చ రఘు, జనార్ధన్, ప్రకాష్, తదితరులున్నారు.

అంబరాన్నంటిన అవతరణ సంబరాలు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంతో పాటు బీజేపీ జిల్లా కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడారు. అలాగే, తెలంగాణ రాష్ట్రం ఎవరో ఇస్తే వచ్చింది కాదని ప్రాణాలను పణంగా పెట్టి తెచ్చుకున్నదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి జాతీయ జెండాను ఎగుర వేశారు. అనంతరం అమరవీరుల స్తూపం, ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహం వద్ద పూలను సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడారు. అలాగే, ఎన్నో ఆశయాలతో ఆకాంక్షలతో సాధించుకున్న తెలంగాణ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చాలా వెనుకబడిందని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం తన క్యాంపు కార్యాలయ ఆవరణలో పార్టీ శ్రేణులతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. అలాగే, టీడీపీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్‌చౌరస్తాలో పార్టీ నియోజక వర్గ కన్వీనర్ అల్లూరి రాజారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు.

ఉట్నూర్: ఉట్నూర్ మండలంలో గ్రామ గ్రామాన సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు.ఉట్నూర్ మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఏఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ కాజల్‌సింగ్, తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ అమృతలాల్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాంప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ప్రభాకర్‌రావ్, వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానపాధ్యాయులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

జైనథ్: జైనథ్ ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో బీజేపీ మండల అధ్యక్షులు లోక కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రతాప్ యాదవ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు సత్యనారాయణ, తదితరులున్నారు.

'బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి'

బోథ్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పదవి త్యాగం చేసిన కొండ లక్ష్మణ్ బాపూజీని ప్రభుత్వం తెలంగాణ జాతిపితగా ప్రభుత్వం గుర్తించాలని పద్మశాలి సంఘం బోథ్ పట్టణ అధ్యక్షుడు మెరుగు భోజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని కొండఆ లక్ష్మణ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ మొదటి నుండి ఎంతగానో పోరాటం చేశారన్నారు. ప్రభుత్వం ఆయన పోరాట పాటి గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు గంగుల మల్లేష్, ప్రధాన కార్యదర్శి మాసం అనిల్, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు : ముఖడే ఉత్తం

ఇంద్రవెల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని ప్రతీ పేదవాడికి ఇల్లు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాన్ని అందజేసి, నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీవన్ రెడ్డి, పంచాయతీ ఈవో సంజీవ్ రావు, ఉపాధి హామీ ఏపీవో జాదవ్ శ్రీనివాస్, నాయకులు సోన్ కాంబ్లే జితేందర్, సోమోరే నాగోరావు, ఎండీ జహర్, తదితరులు పాల్గొన్నారు.



పశువులను తరలిస్తున్న వారిని పట్టుకున్న పోలీసులు(ఫైల్)

పశువుల అక్రమ రవాణాపై కొరడా

(1వ పేజీ తరువాయి...)

నిఘాను సారించడంతో అక్రమంగా తరలిస్తున్న పశువుల రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో దళారులతో అధికారులకు వాగ్వాదం చోటు చేసుకుంటున్న సందర్భాలు ఉంటున్నాయి. అయితే దళారులు రాత్రి వేళల్లో కాలినడకన అడ్డదారుల్లో కూలీల సహాయంతో పశువులను సరిహద్దులు దాటిస్తూ అమ్మేసుకుంటున్నట్లు తెలుస్తుంది.

ప్రశ్నార్థకంగా మారిన పోషణ

పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్న పశువుల పోషణ ప్రశ్నార్థకంగా మారింది. నెలల తరబడి పశువులను పోసించలేమటూ గోశాల నిర్వాహకులు చేతులెత్తేస్తున్నారు. సాధారణంగా పట్టుబడిన ఎద్దులను రైతులు వ్యవసాయ అవసరాల నిమిత్తం తీసుకెళ్తారు. కోర్టు తీర్పు వచ్చిన తర్వాత తిరిగి అప్పగిస్తారు. ఈ విధంగా వచ్చే కొంత ఆదాయంతో మిగత పశువులకు మేత కొనుగోలు, గోశాల నిర్వహణ లాంటి అవసరాలను తీర్చుకుంటారు. అయితే నెలల తరబడి కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉండడంతో తరచూ పట్టుబడుతున్న పశువుల పోషణ భారంగా మారిందని చెబుతున్నారు. దీనికి గాను ఒక్కో పశువుకు రూ.300 వసూలు చేస్తారు. ఇదే విషయమై ఇటీవల గుడిహత్నూర్ మండలంలోని ఓ గోశాల నిర్వాహకుడితో వ్యాపారులు వాగ్వాదానికి దిగారు. బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసును నమోదు చేశారు. ఇలాంటి సంఘటనలతో గోశాలను నిర్వహించడం కష్టంగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాతలు కూడా సహకరించడం లేదంటున్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి మృతి

బోథ్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పలదరి గ్రామానికి చెందిన జుగునక్ శ్రీనివాస్ (25) అనే యువకుడు ఆదివారం రాత్రి ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. మృతుడి అన్న గత కొన్ని రోజుల క్రితం ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి రావడం జరిగింది. అయితే విదేశాలకు వెళ్లి వచ్చిన తర్వాత ఇద్దరు అన్నదమ్ములు కలిసి ఉపాధి కోసమని ట్రాక్టర్ కొనుగోలు చేశారు. అయితే ఆదివారం పొలం దున్నేందుకు వెళుతున్న సందర్భంగా ట్రాక్టర్ బోల్తా పడటంతో శ్రీనివాస్ మృతి చెందాడు. బతుకుతెరువు కోసం తెచ్చిన ట్రాక్టర్ ప్రమాదానికి గురై మృతి చెందడం తీరని శోకం నిండింది. గత వారం రోజుల క్రితం అన్న వివాహం జరుగగా.. వారం రోజులకే తమ్ముడు మృతి చెందడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

తాగునీటి బోరు ప్రారంభం

బేల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంఖం గ్రామంలో పాయల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీటి బోరును ప్రారంభించారు. సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఇంద్ర శేఖర్ బీజేపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ ఠాక్రే, జనరల్ సెక్రెటరీ సందీప్, మాజీ సర్పంచ్ రాకేష్, గణేష్, మోరేశ్వర్,రాము బర్కాడే గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న జిల్లా ఎస్పీ



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న ఎమ్మెల్యే రామరావ్ పాటిల్



జెండా వందనం చేస్తున్న బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి



జాతీయ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో, జిల్లా పోలీస్ కార్యా లయంలో సాయుధ దళ కార్యాలయంలో జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ డా.జి.జానకిషర్మిల ఐపీఎస్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన తరువాత జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ పోలీ సులకు, ప్రజలకు, అధికారులకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 17 మంది పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ చొరవ తో సేవా పథకాలు లభించాయి. వారిలో ఎండీ తహీర్ ఖాన్ ఉత్తమ సేవా పతకంకు ఎంపిక కాగా మిగిలిన 16 మందికి సేవా పతకానికి ఎంపికయ్యారు. ఈసేవా పతకాలకు ఎంపి కైన పోలీస్ అధికారులకు నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల అభినందించారు. నిబద్ధతతో బాధ్యతలు చేపట్టే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏవో యూనస్ అలీ, ఇన్‌స్పెక్టర్లు గోవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, ఎం.కృష్ణ, సమ్మయ్య, ఆర్‌ఐ రామ్‌నిరంజన్, శేఖర్, రామకృష్ణ, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు, పోలీసు సిబ్బంది, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా సెంట్రల్ లైబ్రరీలో జాతీయ జెండాను గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అర్జుమన్ అలీ ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయం నుండి సిబ్బంది, మెప్మా సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహిం చారు. విజయ ఉన్నత పాఠశాలలో జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. విద్యాలయం కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం జాతీయ పతాకాన్ని ఆవిష్క రించారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. బీజేపీతోనే సామాజిక తెలంగాణ సాధ్యమని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి జాతీ యపతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ వస్తే బతుకులు బాగుపడతాయని, బం గారు తెలంగాణ అవుతుందనుకుంటే అప్పుల తెలంగాణగా మార్చారని మండి పడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక అధికారి దుర్గం శంకర్, పో లీస్ స్టేష న్‌లో ఎస్సై పద్వాల్ ర వీంద ర్, పీఏసీఎస్‌లో ఛైర్మన్ పీవీ రమణారెడ్డి, ఐకేపీ భవన్‌లో మండల సమాఖ్య అధ్యక్షురాలు ముస్కు సునీత, న్యూలోలంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

భైంసా : భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, బీజేపీ పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. రాజకీయ పార్టీ కార్యాలయాల్లో ఆయా పార్టీల బాధ్యులు జాతీయ జెండాను ఎగురవేశారు. స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ కాలనీ ఆవరణలో జై జవాన్ సేవా సమితి తెలంగాణ ఉద్యమకారులను ఘనంగా సన్మానించింది.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకం ఎగురవేశారు. మిఠాయిలు పంచి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కే. శ్రీలత, మండలాభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో శివ కుమార్, మండల విద్యావనరుల కార్యాలయంలో ఎంఈవో రమణారెడ్డి, ముథోల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈవో అన్వర్, ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో సరోజిని, పంచాయతీ రాజ్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అబుల్, వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రధాన శాస్త్రవేత్త డా.ఇ. నర్సయ్య, పీఏసీఎస్ కార్యాలయంలో ఛైర్మన్ వెంకటేష్‌గౌడ్, పోలీస్ స్టేషన్‌లో సీఐ మల్లేష్‌తో పాటు ప్రభుత్వ కార్యాల యాల్లో సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీలో కార్యదర్శులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బి. గంగాధర్ జెండా ఎగురవేశారు.

భైంసా రూరల్: భైంసా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సుదీర్ఘకాలంలో జరిగిన ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో అమరులైన వారి త్యాగాల మహోత్స వమైందన్నారు. ప్రతి ఒక్కరూ మార్గదర్శనం తీసుకొని రాష్ట్ర అభివృద్ధి సాధనకు కృషి చేయాలన్నారు. ఎందరో త్యాగాల ఫలమే తెలంగాణ రాష్ట్రమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఏపీవో శివ లింగయ్య, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సరిత, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీనివాస్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాధా రాథోడ్ జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గ్రామ పంచాయతీలు, అంగన్‌వాడీ పాఠశాలల్లో కూడా జెండా ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, ఆర్‌ఐ నరేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మాజీ సర్పంచ్ సురకంటి ముత్యం రెడ్డి, నాయకులు అడ్వాల రమేష్, బిల్డింగ్ రజినీకాంత్ పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో తెలంగాణ ఫార్మేషన్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో పుష్పలత, నాయబ్ తహసీల్దార్ వాహిద్ ఉద్దీన్, గిర్దావర్లు నవతజ్యోతి, సుమలత, పంచాయతీ కార్యదర్శులు కైలాస్, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి, నాయ కులు కోంద్ర రేఖ రమేష్, దత్తురాం, నరేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తానూర్ : మండలంలోని అన్ని గ్రామాల్లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురష్కరించుకొని తహసీల్ధార్ కార్యాలయంలో తహసీల్దార్ లింగమూర్తి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నసీరోద్దిన్, గ్రామపంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ జాదవ్ జాలం సింగ్, పీఏసీఎస్ తానూర్ సొసైటీలో ఛైర్మన్ నారాయణ్‌రావుపాటిల్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు.

కుభీర్ : తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 11 సంవత్సరాలు పూర్తవుతున్న తరుణంలో సోమవారం మండల ప్రజలు సంబరాలు నిర్వహించుకన్నారు. ఎందరో తమ ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ కోసం అమరులయ్యారని, ఈ సందర్భంగా వారికి జేజేలు కొట్టారు. ఆయా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయా అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు.

నిర్మల్ రూరల్ : డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు క్యాంపు కార్యాలయం నందు జాతీయ జెండా ఆవిష్కరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జుమన్ అలీ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సోమ భీమ్ రెడ్డి, ఆత్మ ఛైర్మన్ రాంరెడ్డి, పట్టణ అధ్యక్షులు నాందేడపు చిన్ను, సేవాదళ్ అధ్యక్షులు ఎంబడి రాజేశ్వర్, జిల్లా యువజన అధ్యక్షులు సమరసింహారెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్, దేవరకోట ఛైర్మన్ భూరాజ్, యూత్ అధ్యక్షులు సయ్యద్ హర్షద్, మాజీ కౌన్సిలర్లు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలంలో గల ఆయా గ్రామాలలో సోమవారం ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీకాంతారావు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్‌లతో పాటు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గ్రామ పంచాయతీ సెక్రటరీలు జాతీయ జెండాలను ఎగరవేసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సంబరాలను నిర్వహించారు.

కుంటాల : కుంటాల మండలంలో సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధి గురించి పలువురు ప్రసంగించారు. ఈ సందర్భంగా తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లింబాద్రితో పాటు ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో పంచాయతీ సెక్రటరీలు, ప్రభుత్వ ఉద్యోగులు జెండాలను ఆవిష్కరించారు.

లోకేశ్వరం : తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సర్ప రాజు జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమేష్ జెండాను ఎగురవేశారు. మండల విద్యావనరుల కేంద్రంలో బి. చంద్ర కాంత్ జెండాను ఎగురవేశారు. వివిధ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ సెక్రటరీలు జాతీయ జెండాను ఎగురవేశారు. వివిధ కార్యాలయాలకు సంబంధించి అధికారులు, నాయకులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భారత రాష్ట్ర సమితి జెండా, జాతీయ జెండాను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జడ్పీ ఛైర్మన్ లోలం శ్యాంసుందర్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కరిపే శ్యామ్‌సుందర్‌తో కలిసి ఎగురవేశారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ కల సాకారం

● ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఖానాపూర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను సోమవారం ఖానాపూర్ మండలంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని మండలంలోని ప్రతీ గ్రామంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పలు రాజకీయ పార్టీలు యువజన సంఘాల ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. దీంతో ఊరు వాడ మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రజల చిరకాల వాంఛను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చిందన్నారు.



జెండావిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, పీఏసీఎస్ ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ అబ్దుల్ మాజిద్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్‌లు చిన్నం సత్యం, అంకం రాజేందర్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కదార్ల గంగనర్సయ్య ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడు కలను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తల్లి చౌరస్తాలో నిర్వహించిన ఈ వేడుక లకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి చౌరస్తాలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిం చిన అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ మాట్లాడారు. నాటి ముఖ్య మంత్రి కేసీఆర్, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిల పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆకుల శ్రీని వాస్, నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్ జిల్లా నాయకులున్నారు. ఎన్టీఆర్ చౌక్‌లో ఆ పార్టీ మండల అధ్యక్షులు రాజ గంగన్న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి చౌరస్తా వర కు బైక్ ర్యాలీగా వెళ్లిన బీఆర్‌ఎస్ శ్రేణులు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు.



జెండావిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు


కొవిడ్ కేర్

తిరగబెట్టిన కొవిడ్ కథ

కొవిడ్ కథ ముగిసిందని సంబరపడేలోపే కొత్త వేరియెంట్స్ పుట్టుకొచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ప్రస్తుతం దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో కొవిడ్ కేసులు ఊపందుకుంటున్న నేపథ్యంలో, తాజా కొవిడ్ వేరియెంట్లు, వాటి ప్రభావాల గురించి తెలుసుకుందాం!

వ్యాక్సిన్లు, బూస్టర్లతో కొవిడ్ రక్షణ పొందినప్పటికీ, ఆరోగ్య భద్రతా చర్యలు పటిష్టంగా పాటిస్తున్నప్పటికీ, కొత్త కొవిడ్ లక్షణాల మీద ఓ కన్నేసి ఉంచడం అత్యవసరం. ఇప్పటివరకూ మన దేశంలో రెండు రకాల కొత్త వేరియెంట్లు వెలుగులోకొచ్చాయి. అవేంటంటే...

- **ఎన్‌బి.1.8.1:** ఢిల్లీ, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో విస్తృతంగా కనిపిస్తున్న వేరియెంట్ ఇది. ఒమ్రైక్రాన్‌తో సన్నిహిత సంబంధం కలిగిన ఈ వేరియెంట్, స్పైక్ ప్రొటీన్‌పరంగా స్వల్ప ఉత్పరివర్తనాలను కలిగి ఉంది. తేలికపాటి లక్షణాలతో బయల్పడుతున్న ఈ వైరస్, వ్యాక్సిన్ తీసుకోని పెద్దల్లో వేగంగా విస్తరిస్తోంది



- **ఎల్‌ఎఫ్.7:** ఈ వైరస్ దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో బయల్పడింది. 2022కు ముందు కొవిడ్-19 బారిన పడిన పెద్దల వ్యాధినిరోధకశక్తికి, ఈ వైరస్ ఎక్కువ నిరోధకతను కలిగి ఉండవచ్చని అధ్యయనాలు చెప్తున్నాయి.

అయితే ప్రస్తుతానికి ఈ రెండు వేరియెంట్లలో ఏ ఒక్కదాన్నీ ఆందోళనకరమైన వేరియెంటుగా వర్గీకరించడం జరగలేదని, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. కాబట్టి వ్యాక్సిన్లు తీసుకున్న వారిని ఈ వేరియెంట్లు తీవ్ర అస్వస్థతకు గురి చేయలేవు. అయితే గొంతు నొప్పి, పొడి దగ్గు, నీరసం ఈ కొత్త వేరియెంట్ల ప్రధాన లక్షణాలు అనే విషయం గుర్తు పెట్టుకోవాలి. రుచి, వాసన కోల్పోవడం, లాంటి కొవిడ్ సంప్రదాయ లక్షణాలేవీ లేకుండానే ప్రస్తుతం పాజిటివ్ ఫలితాలు వెలువడుతున్నాయి. వీటికి బదులుగా అలర్జీ, సాధారణ జలుబును తలపించే లక్షణాల రూపంలోనే తాజా కొవిడ్ వేరియెంట్లు బయల్పడుతున్నాయి.

వీటి మీద కన్నేసి...

- జ్వరం, లేదా చలి
- ముక్కు దిబ్బెడ, ముక్కు నుంచి నీరు కారడం
- గొంతు నొప్పి
- పొడి దగ్గు
- తలనొప్పి, నీరసం
- జీర్ణసంబంధ సమస్యలు (డయేరియా)
- ఒంటి నొప్పులు

ఈ లక్షణాలు కనిపిస్తే?

- ఇంటి పట్టునే శరీర ఉష్ణోగ్రత, ఆక్సిజన్ మోతాదులను పరీక్షించుకోవాలి
- బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఇంటికే పరిమితమైపోవాలి
- ఆర్‌టి-పిసిఆర్ లేదా యాంటిజెన్ పరీక్షలు చేయించుకోవాలి
- 3 నుంచి 4 రోజుల్లో లక్షణాలు అదుపులోకి రాకపోతే వైద్యులను కలవాలి

ఆయుర్వేదం



వానాకాలం

వానాకాలం జలుబు, దగ్గు, జ్వరాలు సహజమే! అయితే వీటన్నిటి మూల కారణం జీర్ణ వ్యవస్థలో ఉంటుందని ఆయుర్వేదం చెప్తోంది. ఈ కాలంలో కుంటుపడే జీర్ణవ్యవస్థ, రోగనిరోధక వ్యవస్థలను ఎలా దార్లోకి తెచ్చుకోవాలో తెలుసుకుందాం!

వెతలకు చెక్

వానాకాలంలో శరీరంలో వాతం, పిత్తం పెరుగుతాయి. ఆదాన కాలమైన వేసవిలో కుంటుపడే జీర్ణశక్తి, వానాకాలంలో మరికాస్త దిగజారుతుంది. దాంతో అరుగుదల మందగిస్తుంది. ఫలితంగా పేగుల్లోని మంచి బ్యాక్టీరియా క్షీణించి, రోగనిరోధకశక్తి కూడా సన్నగిల్లుతుంది. దీనికి తోడు వానాకాలంలో వ్యాధికారక సూక్ష్మక్రిములు విజృంభించడం, కలుషిత ఆహారం, నీటి వల్ల సుల భంగా వ్యాధుల బారిన పడుతూ ఉంటాం.



అయితే దగ్గు, జలుబులు, జ్వరాలు చలికాలంలో కూడా వేధిస్తాయి. కానీ వాటికి ప్రధానంగా గాల్లో విస్తరించి ఉండే వ్యాధికారక సూక్ష్మక్రిములు పొడిబారిన శ్వాసకోస వ్యవస్థలోకి సులువుగా చొరబడి ఇబ్బంది పెట్టడమే కారణం. కానీ వానాకాలపు జలుబు, దగ్గు, జ్వరాలకు మాత్రం సన్నగిల్లిన వ్యాధినిరోధకశక్తే ప్రధాన కారణమవుతూ ఉంటుంది. కాబట్టి ఈ కాలంలో తలెత్తే అసౌకర్యాలకు కారణాన్ని బట్టి చికిత్సను అందించాల్సి ఉంటుంది.

త్రికటుతో తరిమికొట్టి...

త్రికటువులైన శొంఠి, మిరియాలు, పిప్పళ్లు ఈ కాలంలో తీసుకుంటూ ఉండాలి. ఈ పొడిని పండ్ల మీద చల్లుకుని తినొచ్చు. లేదా నేరుగా తినొచ్చు. గోరువెచ్చని నీళ్లలో కలుపుకుని తాగొచ్చు. దీంతో జీర్ణశక్తి పెరగడంతో పాటు శ్వాసకోస వ్యవస్థ ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా రక్షణ కూడా దొరుకుతుంది. కాబట్టి రోజుకు పావు టీస్పూను చొప్పున త్రికటు తీసుకోవచ్చు. ఇదే కాకుండా తాలిసాది చూర్ణం, సీతోఫలాది చూర్ణాలు కూడా వానాకాలపు అనారోగ్యాల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. జలుబు వచ్చినా, రాబోతున్నట్టు అనిపించినా త్రికటు, లేదా సీతాఫలాది లేదా తాలిసాది చూర్ణాల్లో ఏదో ఒకదాన్ని తీసుకోవచ్చు. పెద్దలు ఉదయం, సాయంత్రం ఒక చెంచా చూర్ణాన్ని తేనెతో లేదా గోరువెచ్చని నీటితో కలిపి తీసుకోవాలి. తేనె స్వచ్ఛంగా ఉండాలి.

జలుబు, దగ్గు, జ్వరం

జ్వరాన్ని తగ్గించడం కోసం 'షడంగ పానీయం' తీసుకోవచ్చు. అర చెంచా పొడిని రెండు గ్లాసుల నీళ్లలో కలిపి, ముప్పావు వంతుకు మరిగించి, వడగట్టి రెండు పూటలూ తీసుకోవాలి. జలుబుకు 'వ్యోషాది వటి' ఉపయోగపడుతుంది. ఉదయం, రాత్రి రెండు మాత్రల చొప్పున తీసుకోవాలి. రెండేళ్ల లోపు పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరాలను తగ్గించడం కోసం 'కస్తూరి' మాత్రలు అందించాలి. ఒకటి లేదా రెండు మాత్రలను దంచి తల్లిపాలలో లేదా మరిగించి చల్లార్చిన నీళ్లలో రంగరించి పిల్లలకు పట్టించవచ్చు. 'వాయు గుళిక' జలుబుకు సమర్థమైన ఔషధం. ఈ గుళికను మూడు పూటలా తీసుకోవాలి. నవజ్వరానికి (ప్రారంభంలో ఉన్న జ్వరం) శొంఠి, అల్లపు రసం, మిరియాలు, తేనె కలిపి చెంచా చొప్పున మూడు పూటలూ ఇవ్వాలి. పొట్టలో సమస్యలకు, నీళ్ల విరోచనాలకు 'కుటజ ఘనవటి' మూడు పూటలా రెండు మాత్రల చొప్పున తీసుకోవాలి. పిల్లలకు అర మాత్ర సరిపోతుంది. ద్రవరూపంలోని కుటజారిష్ట అయితే, పెద్దలు, 15 మిల్లీ లీటర్ల చొప్పున మూడు పూటలా తీసుకోవాలి. నులిపురుగుల సమస్యలు కూడా ఈ కాలంలో ఎక్కువే! దీని కోసం ద్రవరూపంలోని 'విడంగారిష్ట'ను 15 మిల్లీలీటర్ల చొప్పున మూడు పూటలూ తీసుకోవాలి. పిల్లలకు 10 మిల్లీలీటర్లు సరిపోతుంది.

తినవలసినవి - తినకూడనివి

ఈ కాలంలోని ఆరోగ్య సమస్యలకు సన్నగిల్లిన వ్యాధినిరోధకశక్తి ప్రధాన కారణం కాబట్టి అందుకు కారణమైన జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవడం మీదే ధ్యాస పెట్టాలి. అందుకోసం జీర్ణ సంబంధ సమస్యలను నియంత్రించుకోవాలి. కొన్ని పదార్థాలను తినడం మానుకోవాలి. కొన్నిటిని తప్పనిసరిగా తింటూ ఉండాలి.

- **తినకూడనివి:** పచ్చి కూరగాయలు, పండ్లను శుభ్రంగా కడిగి తినాలి. మొక్కజొన్నను ఉడికించకుండా, కాల్చి తినాలి. సజ్జలు, మార్కెట్లో దొరికే పాలకూర తినకూడదు. ఇంట్లో పండించిన పాలకూర తినొచ్చు. అలాగే కాకరకాయ, క్యాబేజీ, బంగాళాదుంపలు, క్యారెట్ తినకూడదు. కఫాన్ని పెంచే చేపలు తగ్గించాలి. ఆవు పాలు తీసుకోవచ్చు. గేదె పాలు మానేయాలి. కఫాన్ని పెంచే తీపి పదార్థాలు, వెన్న, జున్ను తీసుకోకూడదు. అలాగే చల్లదనాన్ని అందించే కీర, పుచ్చ ఈ కాలంలో పనికి రాదు. మజ్జిగను నేరుగా తీసుకోకుండా మజ్జిగపులుసు రూపంలో తీసుకోవచ్చు.
- **తినదగినవి:** బెండ, పెసరపప్పు, మినపప్పు, ఉల్లి, వెల్లుల్లి తీసుకోవచ్చు. ఉల్లి, వెల్లుల్లిలో నీటిలో కరిగే పీచు ఉంటుంది. ఇది పేగులకు మంచిది కాబట్టి వీటిని ఈ కాలంలో తప్పనిసరిగా తీసుకోవాలి. దుంపల్లో కంద తినొచ్చు. ద్రాక్ష పండ్ల మీద తెల్లని పొర ఉంటుంది. ఇది అందరూ అనుకుంటున్నట్టు పురుగుమందులతో ఏర్పడిన పొర కాదు. అది ఆరోగ్యానికి మేలుకరమైన బ్యాక్టీరియా పొర. కాబట్టి ద్రాక్షను కడిగినా, ఈ తెల్లని పొర తొలగిపోకుండా చూసుకోవాలి. మామిడి, నిమ్మ పండ్లు తీసుకోవచ్చు. ఈ కాలంలో కొత్తిమీర, పుదీనా కూడా తీసుకోవాలి.

డాక్టర్ డి.వి. ప్రశాంత్ కుమార్
పంచకర్మ స్పెషలిస్ట్, శక్తి ఆయుర్వేదిక్ క్లినిక్, ఈస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్.



డిజిటల్ స్క్రీన్స్ మన జీవితంలో భాగాలైపోయాయి. గంటల తరబడి కళ్లను తెరలకు అప్పగించకపోతే రోజు గడవని పరిస్థితి. అయితే ఈ జీవనశైలితో కళ్లకు కీడు కలుగుతోందా? వైద్యులేమంటున్నారు?

కంటి ఆరోగ్యం





తెరలతో తంటా

కళ్లు పొడిబారడం, కళ్ల మంటలు, ఎరుపెక్కడం, నీరు కారడం, కనుబొమల నొప్పులు... ఇవన్నీ డిజిటల్ స్క్రీన్స్ వాడకంలో మనం చేసే పొరపాట్లకు సంకేతాలు. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, టివిలు మన జీవితంలో భాగాలైపోయినప్పుడు, వాటిని వినియోగించుకుంటూనే కళ్లు దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు కూడా పాటిస్తూ ఉండాలి. ఏ స్క్రీన్ ఎంత దూరంలో ఉండాలి? వాటిని ఎంత సమయం పాటు చూడాలి? ఎంత వ్యవధికి బ్రేక్ తీసుకోవాలి? కళ్లు అలసటకు లోను కాకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి? అన్నది కూడా తెలుసుకోవాలి.

నీలి కిరణాలను వడగట్టి...

పుస్తకం చదివేటప్పుడు కళ్లకు ఎంత దూరంగా ఉంచుకుని చదువుతామో, మొబైల్ ఫోన్లను కూడా అంతే దూరంలో ఉంచి వాడుకోవాలి. అయితే ఇటీవలి కాలంలో పిల్లలు సెల్‌ఫోన్లకు ఎక్కువగా అలవాటు పడిపోతున్న సందర్భాలు పెరుగుతున్నాయి. నిజానికి ఆరేళ్ల వరకూ పిల్లల కనుగుడ్లు అభివృద్ధి దశలోనే ఉంటాయి. కాబట్టి ఈలోగా అతిగా మొబైల్ ఫోన్లకు అలవాటు పడడం వల్ల పిల్లల్లో మెల్లకన్ను తలెత్తుతుంది. పెద్దలైనా అదే పనిగా రెండు గంటలకు మించి సెల్‌ఫోన్ వాడడం కళ్లకు హానికరం. ఆ రెండు గంటల్లో ప్రతి అరగంటకూ విరామం తీసుకోవాలి. పిల్లల విషయానికొస్తే, రోజు మొత్తంలో, బడిలో, ఇంట్లో కలిపి, రెండు గంటలకు మించి స్క్రీన్స్ చూడకూడదు. ఈ రెండు గంటల్లో ప్రతి 20 నిమిషాలకూ బ్రేక్ ఇవ్వాలి. పిల్లలకు సెల్‌ఫోన్స్ ఇచ్చేటప్పుడు, అలారం, స్క్రీన్ కంట్రోల్ టైమ్ సెట్ చేసి ఇవ్వడం మంచిది. వీటితో పిల్లల సెల్‌ఫోన్ వాడకాన్ని పరిమితం చేయవచ్చు. గేమ్స్ ఆడేటప్పుడు పిల్లలు మొబైల్‌ఫోన్‌ను కళ్లకు మరీ దగ్గరకు తీసుకొచ్చేస్తూ ఉంటారు. దీంతో కళ్లలో మైనస్ పవర్ పెరుగుతుంది. కాబట్టి ఈ విషయంలో పెద్దలు పిల్లలను కట్టడి చేయాలి. మరీ ముఖ్యంగా డిజిటల్ స్క్రీన్స్ నుంచి వెలువడే నీలి కిరణాల వల్ల కంటికి హాని కలుగుతుంది. కాబట్టి ఆ కిరణాలను అడ్డుకునే ఫిల్టర్లను ఫోన్లు, డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్స్‌లో ఉపయోగించాలి. కళ్లజోడు అలవాటున్న వాళ్లు ఆ కిరణాలను అడ్డుకునే పూత కలిగిన జోళ్లను వాడుకోవాలి. అలాగే టివిలకు కనీసం 20 అడుగుల దూరం పాటించాలి. సాధారణ వెలుగులోనే టివి చూడాలి తప్ప, కిటికీలు, తలుపులు మూసేసి, లైట్లు ఆర్పేసి చీకట్లో టివి చూడడం సరి కాదు.

ఇలాంటప్పుడు అప్రమత్తం కావాలి

- స్క్రీన్ చూస్తున్న అరగంటకే కళ్లు మసకబారుతున్నా...
- ఒకటికి రెండు చిత్రాలు కనిపిస్తున్నా...
- కళ్లు ఎర్రబడి, నీళ్లు కారుతున్నా...
- పిల్లల్లో మెల్లకన్ను మొదలైనా...
- పిల్లలు తెరను చూడడం మొదలుపెట్టిన అరగంటకే తలనొప్పి మొదలైనా...
- పిల్లలు రాయడానికి ఇబ్బంది పడుతున్నా...
- పెద్దలు ఫాంట్ సైజు పెంచవలసిన అవసరం పడుతున్నా...

20-20-20 నియమం

ప్రతి 20 నిమిషాలకూ 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును చూడవలసిన నియమమిది. దగ్గర్లో ఉన్న తెరలను చూస్తున్నప్పుడు కళ్లలోని కండరాలు అలసటకు లోనవుతాయి కాబట్టి ప్రతి 20 నిమిషాలకూ 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలోని వస్తువును చూడగలిగితే, కంటి కండరాలు రిలాక్స్ అవుతాయి.

ఏం చేయాలి?

కళ్లు అలసటకు లోనై పొడిబారినా, మండుతున్నా, నీరు కారుతున్నా మానిటర్ల వాడకం ఆపేసి, 20-20-20 నియమం అనుసరించాలి. దీంతో ఫలితం లేనప్పుడు కంటి వైద్యులను కలిసి, వాళ్లు సూచించే కంటి చుక్కల మందులు వాడుకోవాలి. వీటితో పొడిబారిన కళ్లు తేమగా మారతాయి. ఈ చుక్కల మందును ఫ్రిజ్ డోర్‌లో దాచుకుని వాడుకోవాలి. అలాగే ఈ చుక్కల మందును ఒకసారి మూత తెరిచి, వాడడం మొదలుపెట్టిన తర్వాత నెల రోజుల వరకూ వాడుకుని, మిగతా మందును పారేయాలి. దాచుకుని వాడుకోకూడదు.

అయితే ఈ చుక్కల మందును ఎవరికి వారు కొనుక్కుని వాడుకోవడం సరి కాదు. కంటి సమస్యలకు కారణం స్క్రీన్స్ మాత్రమే అని నిర్ధారించలేం! ఇతరత్రా కంటి సమస్యల్లో కూడా ఈ లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. కాబట్టి వైద్యులు సూచించినప్పుడు మాత్రమే వీటిని వాడుకోవాలి.

డాక్టర్ ఎమ్. నిఖిల,
కన్సల్టెంట్ ఆప్తల్మాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్



పరిశోధన

బరువు తగ్గించే అమైనో ఆమ్లం

బరువు తగ్గడంలో అమైనో ఆమ్లం కీలక పాత్ర పోషిస్తుందని అమెరికా, కెనడా పరిశోధకులు కనుగొన్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం...

మాంసం, తృణధాన్యాల్లోని సిస్టీన్ అనే అమైనో ఆమ్లం, బరువు తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని ఎలుకలపై చేసిన ఓ తాజా అధ్యయనంలో తేలింది. దీని వలన అమైనో ఆమ్లాలతో ఔషధాల అభివృద్ధికి అవకాశం కలుగుతుందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేశారు. 9 రకాల అమైనో ఆమ్లాలు లేని ఆహారం అందించి ఎలుకలను పరిశీలించినప్పుడు, పలు అణువులను అమైనో ఆమ్లంగా మార్చే ఎంజైమ్ లోపించిన ఎలుకలు, సిస్టీన్ రహిత ఆహారం తిని వారంలోనే 31 శాతం బరువు తగ్గినట్టు నేచర్‌లో ప్రచురితమైన ఆ అధ్యయనంలో వెల్లడించారు. అయితే ఎంజైమ్ ఉన్న ఎలుకలు సిస్టీన్ రహిత ఆహారం తీసుకున్నా బరువు తగ్గలేదు. అయితే ఆ ఎంజైమ్ ఉన్న ఎలుకలు పరిమిత క్యాలరీల సిస్టీన్, మిథియోనిన్ లేని ఆహారం తీసుకున్నప్పుడు, 25 శాతం బరువు తగ్గే అవకాశం ఉందని పరిశోధకులు కనుగొన్నారు.



మనుషులకు మంచిదేనా?

ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీలో చేసిన ఓ మానవ ప్రయోగంలో... సిస్టీన్, మెథియోనిన్ తక్కువగా ఉన్న ఆహారం తిన్న వారిలో ఎలాంటి ప్రతికూల ప్రభావాలు కనుగొనలేదని, అలాగే వారు బరువు తగ్గినట్లు గుర్తించామని పరిశోధకులు వెల్లడించారు. అయితే ఈ విధమైన ఆహారం ప్రజలపై ఎంత ప్రభావంతంగా పనిచేస్తుంది, ఏ మేరకు సురక్షితమన్నది తెలుకోవడం కోసం మరిన్ని పరిశోధనలకు అవసరమని వారు పేర్కొన్నారు. సిస్టీన్ చాలా ఆహార పదార్థాల్లో ఉంటుంది కాబట్టి ఆహారం ద్వారా సిస్టీన్ అందకుండా చేయడం సవాలుతో కూడుకున్న విషయమని అభిప్రాయపడ్డారు. కాబట్టి సిస్టీన్ స్థాయులను అవసరమైన మేర తగ్గించడానికి ఔషధాలను అభివృద్ధి చేయడం సరైన మార్గమనీ, ఆ ఔషధాలు కొవ్వు తగ్గించడానికి కూడా ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

మీకు తెలుసా?

కృత్రిమ రక్తం



రక్తదానం ప్రాణదానంతో సమానం. కానీ అనేక సందర్భాల్లో సమయానికి సరిపడా రక్తం దొరకక, సరిపోలే రక్తగ్రూపు అందుబాటులో లేక సర్జరీలు వాయిదా పడుతూ ఉండడం, ప్రాణనష్టం సంభవించడం మనం చూస్తూ ఉంటాం. అయితే ఇలాంటి ఇబ్బందులకు చెల్లుచీటీ రాస్తూ, నేషనల్ డిఫెన్స్ మెడికల్ కాలేజీకి చెందిన జపాన్ పరిశోధకులు కృత్రిమ రక్తాన్ని రూపొందించారు.

ఈ కృత్రిమ రక్తాన్ని రక్తపు గ్రూపు మ్యాచింగ్‌తో సంబంధం లేకుండా, ఎవరైనా మార్పిడి చేసుకోవచ్చు. ఈ సింథటిక్ రక్తంలో ఎర్ర రక్త కణాలతో పాటు, ప్లేట్‌లెట్లు కూడా ఉంటాయి. ఇప్పటివరకూ చేపట్టిన జంతు ప్రయోగాల్లో ఈ రక్తంతో విజయవంతంగా రక్త నష్టాన్ని భర్తీ చేయగలిగారు. దానం చేసిన రక్తానికి భిన్నంగా ఈ కృత్రిమ రక్తాన్ని ఎక్కువ కాలం కూడా నిల్వ చేసుకోవచ్చు. దీన్ని గది ఉష్ణోగ్రత వద్ద ఏకంగా ఏడాది పాటు నిల్వ చేసుకుని, అత్యవసర సమయాల్లో, మారుమూల ప్రాంతాలకు తరలించడానికి ఉపయోగించుకోవచ్చు.

ఆవిష్కరణ

గర్భం వెలుపల పిండం



శరీరం వెలుపల పిండాన్ని పెంచే వీలుండే కృత్రిమ గర్భాశయాన్ని జపాన్ అభివృద్ధి చేసింది. జపాన్, ఆస్ట్రేలియాకు చెందిన పరిశోధకులు నెలలు నిండకుండా పుట్టిన, జబ్బుపడిన పిండాలకు చికిత్సలందించి, ప్రాణాలను కాపాడడం కోసం, ఎక్స్ వివో యుటెరిన్ ఎన్విరాన్‌మెంట్ థెరపీ ప్రధానంగా ఈ ఆవిష్కరణకు పూనుకుంది. ఈ కృత్రిమ గర్భాశయం, నెలలు నిండకుండా పుట్టిన పిల్లల్లో తలెత్తే సమస్యలను అడ్డుకునే నియంత్రిత పర్యావరణాన్ని కలిగి ఉండడం విశేషం. అయితే మానవ శరీరం వెలుపల తొమ్మిది నెలల పిండాన్ని పెంచడం ఈ సాంకేతిక ఆవిష్కరణ ఉద్దేశం కాదనీ, కేవలం నెలలు నిండకుండా పుట్టిన పిల్లల ప్రాణాలను కాపాడడమే తమ ప్రధాన ఉద్దేశమని ఈ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

బిజినెస్

నిజామాబాద్ ● మంగళవారం 3 జూన్ 2025

ప్రపంచంలో అత్యంత విలువైన టెక్ దిగ్గజాల్లో రిలయన్స్

రూ.18.45 లక్షల కోట్ల మార్కెట్ విలువతో 23వ స్థానంలో అంబానీ కంపెనీ

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు మరో గౌరవం దక్కింది. ప్రపంచంలోని 30 అత్యంత విలువైన లిస్టెడ్ టెక్ దిగ్గజ కంపెనీల జాబితాలో రిలయన్స్‌కూ చోటు లభించింది. ఈ లిస్ట్‌లో స్థానం దక్కించుకున్న ఏకైక భారత కంపెనీ ఇదే. 'ట్రెండ్స్-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' పేరుతో సోమవారం విడుదలైన రిపోర్టు ప్రకారం.. 21,600 కోట్ల డాలర్ల (రూ.18.45 లక్షల కోట్లు) మార్కెట్ విలువతో రిలయన్స్ 23వ స్థానంలో నిలిచింది. కాగా, అమెరికాకు చెందిన మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, యాపిల్, అమెజాన్, ఆల్ఫాబెట్, మెటా ప్లాట్‌ఫామ్స్, టెస్లా, బ్రాడ్‌కామ్ వరుసగా తొలి 8 స్థానాలను కైవసం చేసుకున్నాయి. తైవాన్‌కు చెందిన టీఎస్ఎంసీ 9వ స్థానంలో ఉంది. చైనా కంపెనీ టెన్సెంట్ 10వ స్థానంలో ఉంది.

ఇనుప ఖనిజం ఉత్పత్తిలో 22 శాతం వృద్ధి లక్ష్యం: ఎన్ఎండీసీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీ ఈ ఏడాది ఇనుప ఖనిజం ఉత్పత్తిని 22% మేరకు పెంచి 5.5 కోట్ల టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2030 నాటికి 10 కోట్ల టన్నులకు ఉత్పత్తిని విస్తరించాలన్న బృహత్ ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 4.5 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించింది. ఏప్రిల్, మే నెలల్లో 45% వృద్ధితో 84.3 లక్షల టన్నుల ఇనుప ఖనిజం ఉత్పత్తి చేసినట్టు తెలిపింది.

వైమానిక రంగంలో అద్భుత అవకాశాలు



విదేశీ సంస్థలు పెట్టుబడులతో రావాలి
విమానాల తయారీ కేంద్రంగా భారత్
ఐఏటీఏ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న భారత వైమానిక రంగం పెట్టుబడులకు అద్భుత అవకాశాల గని అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ కంపెనీలు ముందుకు రావాలని కోరారు. ఢిల్లీలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వార్షిక సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. 2030 నాటికి భారత విమానాల నిర్వహణ, మరమ్మతులు, కార్యకలాపాల (ఎంఆర్‌ఓ) రంగం 400 కోట్ల డాలర్ల స్థాయికి చేరనుందన్నారు. భారత్‌ను విమానాల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని భారత్‌ను ఒక మార్కెట్‌గా కాకుండా.. వాల్యూ చెయిన్ లీడర్‌గా చూడాలని కోరారు. దేశీయ విమానయానపరంగా చూస్తే ప్రస్తుతం భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద మార్కెట్‌గా ఎదిగిన విషయాన్ని ప్రధాని గుర్తు చేశారు. దేశంలోని మారుమూల ప్రాంతాలకు విమానయానాన్ని దగ్గర చేసేందుకు తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉడాన్ పథకం భారత విమానయాన చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమన్నారు.

మరో 50 ఎయిర్‌పోర్టులు

వచ్చే ఐదేళ్లలో దేశంలో కొత్తగా మరో 50 విమానాశ్రయాలు ఏర్పాటు చేయనున్నట్టు ఇదే సదస్సులో పాల్గొన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉంటే, ప్రస్తుతం ఆ సంఖ్య 164కు చేరిందన్నారు. ఉడాన్ పథకంతో దేశంలో విమానయానం ప్రజాస్వామ్యీకరించబడి 619 మార్గాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. విమానాల నిర్వహణ మరమ్మత్తులకూ భారత్‌ను కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర మంత్రి ప్రకటించారు.

విమాన సంస్థల లాభాలు రూ.3 లక్షల కోట్లు

కొన్ని సమస్యలు, సవాళ్లు ఉన్నా ఈ సంవత్సరం అంతర్జాతీయ విమానయాన సంస్థలు 97,900 కోట్ల డాలర్ల (సుమారు రూ.83.59 లక్షల కోట్లు) ఆదాయంపై 3,600 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.07 లక్షల కోట్లు) లాభాలు ఆర్జించే అవకాశం ఉందని ఐఏటీఏ అంచనా. గత ఏడాదితో పోలిస్తే ఇది 360 కోట్ల డాలర్లు ఎక్కువని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ ప్రకటించారు. ప్రస్తుతం విమానయాన రంగం ప్రపంచ జీడీపీలో 3.9 శాతం వాటా కలిగి ఉందన్నారు. భారత విమానయాన రంగం జీడీపీకి 560 కోట్ల డాలర్లు (సుమారు రూ.47,818 కోట్లు) సమకూరుస్తూ నేరుగా 3,69,700 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తోందన్నారు. ఖర్చులు, పన్నుల భారం పెరుగుతున్నా పదేళ్ల క్రితంతో పోలిస్తే విమానయాన సంస్థల వాస్తవ ఖర్చులు 40 శాతం వరకు తగ్గాయని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ అన్నారు. పరోక్షంగా విమానయాన రంగంతో ముడిపడి ఉన్న పర్యాటక రంగాన్ని కూడా కలుపుకుంటే భారత విమానయాన రంగం 77 లక్షల మందికి ఉపాధి, జీడీపీకి 1.5 శాతం సమకూరుస్తోందన్నారు.

ప్లాంట్ పెట్టేందుకు రెడీ: ఎంబ్రాయర్

భారత్‌లో పూర్తి స్థాయి అసెంబ్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయర్ విమానాల తయారీ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. కాకపోతే ఇందుకు భారత విమానయాన సంస్థల నుంచి కనీసం 200 విమానాల ఆర్డర్ అవసరమని కంపెనీ ప్రెసిడెంట్, సీఈఓ ఫ్రాన్సిస్కో గోమెస్ నెటో స్పష్టం చేశారు. ఐఏటీఏ సదస్సుకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. తమ విమానాలు అమ్మేందుకు ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలతో చర్చలు జరుపుతున్నట్టు నెటో వెల్లడించారు.

అదానీ గ్రూప్‌పై అమెరికా దర్యాప్తు!

గుట్టుగా ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి

తోసిపుచ్చిన అదానీ గ్రూప్

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ గ్రూప్ మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. గుజరాత్‌లోని తన ముంద్రా రేవు ద్వారా కొన్ని కంపెనీలు ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి చేసుకునేందుకు సహకరించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై అమెరికా దర్యాప్తు సంస్థలు దర్యాప్తు ప్రారంభించినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక కథనం ప్రచురించింది. అయితే అదానీ గ్రూప్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఇరాన్ నౌకలు ఏవీ కూడా ఎల్‌పీజీతో తమ రేవులకు రాలేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో తమపై అమెరికా సంస్థలు దర్యాప్తు జరుపుతున్న విషయం కూడా తమకు తెలియదని తెలిపింది. కొన్నిసంస్థలు దురుద్దేశాలతో తమపై కావాలనే ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు ప్రచారం చేస్తున్నాయని అదానీ గ్రూప్ తెలిపింది. 'మా రేవుల ద్వారా ఇరాన్ నుంచి వచ్చే ఎలాంటి సరుకుల ఎగుమతి, దిగుమతులను అనుమతించడం లేదు. అది మా విధానపరమైన నిర్ణయం. ఇరాన్ జెండాతో వచ్చే నౌకలు లేదా నేరుగా ఇరాన్ రేవుల నుంచి వచ్చే నౌకలు అన్నిటికీ ఇది వర్తిస్తుంది' అని తెలిపింది.

ఈ విడత 0.50% వడ్డీకోత: ఎస్‌బీఐ

దేశంలో రుణ విభాగాన్ని ఉత్తేజితం చేయడంతో పాటు పలు రకాల అస్థిరతలను దీటుగా ఎదుర్కొనగల శక్తి కల్పించడం కోసం రిజర్వ్ బ్యాంక్ ఈసారి అర శాతం మేరకు రెపోరేటును తగ్గించవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. బుధవారం ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశాలు ప్రారంభమవుతాయి. శుక్రవారం ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఎంపీసీ నిర్ణయాలను ప్రకటించనున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,640 ▲	89,500 ▲	1,11,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	99,820 ▲	89,500 ▲	1,11,000 ▲
రాజమండ్రి	98,840 ▲	90,600 ▲	1,00,300 ▲
ప్రొద్దుటూరు	96,250 ▲	88,550 ▲	98,600 ▲
ముంబై	96,680 ▲	88,559 ▲	97,761 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	109
వరంగల్	107	గుంటూరు	112
కరీంనగర్	107	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	97
కర్నూలు	107	నెల్లూరు	102
విశాఖపట్నం	101	అనంతపురం	102
గోదావరి	109		

విదేశీ కంపెనీలు ఉత్పత్తికి సై అంటే దిగుమతి సుంకం 15 శాతమే..

8,000 ఈవీలకు మాత్రమే అనుమతి

దేశీయ తయారీపై కనీస పెట్టుబడి రూ.4,150 కోట్లు ఉండాలి

కొత్త ఈవీ పాలసీ మార్గదర్శకాలు విడుదల

న్యూఢిల్లీ: దేశీయంగా విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీకి ముందుకు వచ్చే విదేశీ కంపెనీలకు దిగుమతి సుంకాలు గణనీయంగా తగ్గించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈవీల స్థానిక తయారీని పటిష్ఠం చేయడం, ప్రపంచ పారిశ్రామికవేత్తలను ఆకర్షించడం లక్ష్యంగా రూపొందించిన కొత్త ఈవీ విధానం మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం నోటిఫై చేసింది. దీంతో ఈ పాలసీ ఇప్పుడు అమలులోకి వచ్చినట్టవుతుంది. దాని ప్రకారం ఈవీల తయారీలో కనీసం రూ.4,150 కోట్ల పెట్టుబడులు పెట్టే ఆటో తయారీదారులను 15% తగ్గింపు సుంకంపై 8,000 ఈవీలు దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తారు. అయితే అనుమతులు పొందిన తేదీ నుంచి మూడు సంవత్సరాల్లోగా ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభించడంతో పాటు తయారీలో ఎంత శాతంలో స్థానిక ఉత్పత్తులు వినియోగించేది ప్రకటించాల్సి ఉంటుంది.

ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా రెండు వారాల్లో ప్రత్యేక విభాగం ఏర్పాటవుతుందని, 120 రోజులు అది అందుబాటులో ఉంటుందని అధికారి ఒకరు తెలిపారు. ఆ తర్వాత కూడా వచ్చే ఏడాది మార్చి 15 వరకు ఎప్పుడు అవసరం అనుకుంటే అప్పుడు దరఖాస్తుల విభాగాన్ని తెరిచే అవకాశం ఉంది. ఈ స్కీమ్ కింద ఒక్కో దరఖాస్తుదారునిపై కోల్పోయే సుంకాల గరిష్ఠ పరిమితి రూ.6,484 కోట్లుగా ఉండనుందన్నారు.

భారత్‌లో తయారీపై టెస్లా అనాసక్తి

ప్రపంచ ఆటోమొబైల్ కంపెనీలు మెర్సిడెస్ బెంజ్, స్కోడా-ఫోక్స్‌వేగన్, హ్యుండయ్, కియా దేశంలో విద్యుత్ కార్ల తయారీపై ఆసక్తిని ప్రకటించాయని ఈ పాలసీ మార్గదర్శకాల విడుదల సందర్భంగా కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. అయితే ప్రపంచ ఈవీ దిగ్గజం టెస్లా మాత్రం దేశీయ తయారీ పట్ల ఆసక్తిగా లేదని, దేశంలో తమ షోరూమ్‌లు ప్రారంభించేందుకు మాత్రం సిద్ధంగా ఉన్నదని ఆయన చెప్పారు.

మార్కెట్లో మళ్లీ వాణిజ్య, యుద్ధ భయాలు

» సెన్సెక్స్ 77 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లను మళ్లీ వాణిజ్య, యుద్ధ భయాలు అలుముకున్నాయి. స్టీల్, అల్యూమినియంపై సుంకాలను రెట్టింపు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం, ఈ మధ్యనే కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ అమెరికా-చైనా పరస్పర ఆరోపణలు, రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మళ్లీ తీవ్రతరం కావడం, ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ వంటి అంశాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌కు గండికొట్టాయి. దాంతో సోమవారం సెన్సెక్స్ ప్రారంభ ట్రేడింగ్‌లో 796.75 పాయింట్లు క్షీణించి 80,654 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత క్రమంగా కోలుకున్న సూచీ చివరికి 77.26 పాయింట్ల నష్టంతో 81,373.75 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ప్రారంభంలో 224.55 పాయింట్ల వరకు కోల్పోయినప్పటికీ, చివరికి 34.10 పాయింట్ల నష్టంతో 24,716.60 వద్ద స్థిరపడింది. గత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి ప్రభుత్వ అంచనాలకు అనుగుణంగా 6.5 శాతంగా నమోదవడంతో పాటు జీఎస్‌టీ వసూళ్లు వరుసగా రెండో నెలా రూ.2 లక్షల కోట్లు దాటడం, ఈసారి ఆర్‌బీఐ రెపో రేటును అర శాతం వరకు తగ్గించవచ్చన్న అంచనాలు సూచీల రికవరీకి తోడ్పడ్డాయి.

మీనాక్షి ఆల్టర్నేట్స్ రియల్టీ ఫోకస్డ్ ఫండ్

700 కోట్ల కార్పస్‌తో ఏర్పాటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన రియల్టీ, శుద్ధ ఇంధన వ్యాపారాల నిర్వహణలోని మీనాక్షి గ్రూప్ తాజాగా ఆర్థిక సేవల రంగంలోకి ప్రవేశించింది. మీనాక్షి ఆల్టర్నేట్స్ (ఎం-ఆల్ట్స్) పేరుతో ఆర్థిక సేవల అనుబంధ విభాగంతో పాటు దాని పరిధిలో తొలి ఫండ్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు మీనాక్షి గ్రూప్ వెల్లడించింది.

'మీనాక్షి రియల్ అసెట్స్ ఫండ్' పేరుతో రూ.700 కోట్ల కార్పస్‌తో ఈ ఫండ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. సెబీ అనుమతితో కూడిన కేటగిరీ-2 ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఏఐఎఫ్) ఇది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

విడుదలకు సిద్ధమైన ఘాటీ



అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో క్రిష్ జాగర్లమూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఘాటీ'. తమిళ నటుడు విక్రమ్ ప్రభు కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేసింది. తాజాగా, ఈ సినిమాను జూలై 11న ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ప్రకటించి ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సినిమాలోని ప్రధాన పాత్రధారులు సంచులు మోసుకుంటూ నదిని దాటుతున్న విజువల్స్ ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ చిత్రానికి ఎడిటర్: చాణక్యరెడ్డి తూరుపు, వెంకట్ ఎన్.స్వామి, సినిమాటోగ్రఫీ:మనోజ్‌రెడ్డి కాటసాని, సంగీతం:నాగవెల్లి విద్యాసాగర్. కాగా, 'వేదం' తర్వాత క్రిష్, అనుష్క కాంబోలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి.

ధనుష్ నటనకు జాతీయ అవార్డు వస్తుంది





శేఖర్ కమ్ముల

నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కర్ రామ్మోహన్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా, చెన్నైలో ఆడియో వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన చిత్రం. ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది. నాగార్జున, ధనుష్‌ల నటన నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. ధనుష్ ఆల్‌రౌండర్. ఈ చిత్రంలో ఆయన నటనకు జాతీయ అవార్డు వస్తుంది" అని అన్నారు. "సినిమా ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది. శేఖర్ కమ్ముల అద్భుతంగా సినిమాను తెరకెక్కించారు. రజనీకాంత్‌తో నేను నటించిన 'కూలీ' సినిమా మీ అందరి ఊహలకు మించి ఉండబోతోంది" అని నాగార్జున చెప్పారు. "శేఖర్ కమ్ముల స్వచ్ఛమైన మనసు ఉన్న వ్యక్తి. ఇందులో చేసిన పాత్ర నాకెంతో ప్రత్యేకం" అని ధనుష్ తెలిపారు.

ఎంత దుష్ప్రచారం చేస్తారో చేస్కోండి

తనపై వస్తున్న దుష్ప్రచారాలపై ధనుష్ ఈ సందర్భంగా స్పందించారు. "నేనెప్పుడూ నా బెస్ట్ ఇవ్వడానికే ప్రయత్నిస్తుంటాను. నాపై, నా సినిమాలపై ఎంతగా దుష్ప్రచారం చేస్తారో చేసుకోండి. నా సినిమాల విడుదలకు ముందు ప్రతిసారి ఏదో ఒక విషయంలో కుట్రలు పన్నుతూనే ఉంటారు. అయినా ఆ ప్రయత్నాలు నన్నేమీ చేయలేవు. నా అభిమానులు 23 ఏళ్లుగా నా వెన్నంటే ఉన్నారు. ఇలాంటి సర్కస్‌లు చేయడం మానుకోండి. ఎవరెంత దుష్ప్రచారం చేసినా అభిమానులు నాతోనే ఉంటారు" అని పేర్కొన్నారు.

ఫిల్మ్ చాంబర్‌లో 'వీరమల్లు' నిర్మాత



సినిమా టికెట్ ధరల పెంపు లేదా ఏ ఇతర విషయాలకు సంబంధించి అయినా సినీ పరిశ్రమకు చెందిన వారితో వ్యక్తిగత చర్చలకు తావులేదని ఇటీవలె ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పవన్ సూచన మేరకు 'హరి హర వీరమల్లు' చిత్ర నిర్మాత ఏ.ఎం.రత్నం తాజాగా ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్‌ను కలిశారు. తమ చిత్రానికి సంబంధించి అదనపు షోలకు అనుమతి, టికెట్ ధరల సవరణ కోరుతూ లేఖను అందజేశారు. 'హరి హర వీరమల్లు' సినిమా ఈనెల 12న విడుదల కానుంది.

మనసును తాకేలా



సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమా 'తెలుసు కదా'. నీరజ కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. దీపావళి సందర్భంగా అక్టోబర్ 17 సినిమాను ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఊహించని మలుపులతో నిండిన ఈ సినిమా ప్రేక్షకుల మనసును తాకేలా ఉంటుందని తెలిపారు.

థగ్‌లైఫ్‌ను అడ్డుకుంటాం



కన్నడ భాష గురించి నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలతో థగ్‌లైఫ్ సినిమాను కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ నెల 5న సినిమాను కర్నాటకలో విడుదల చేస్తే థియేటర్లకు నిప్పు పెడతామని కర్ణాటక రక్షణ వేదిక(కరవే) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ గౌడ హెచ్చరించారు. కన్నడ సంఘాల ఐక్యకూటమి అధ్యక్షుడు వాటాళ్ నాగరాజ్ మైసూరులో సోమవారం మీడియాతో మాట్లాడుతూ, కమల్‌హాసన్ సినిమాను బహిష్కరించాల్సిందేనని అన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన కమల్ హాసన్

థగ్‌లైఫ్ సినిమాకు వస్తున్న బెదిరింపులపై కమల్ హాసన్, కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. సినిమా ప్రదర్శనకు ఎలాంటి అడ్డంకులు లేకుండా తగిన భద్రత కల్పించేలా చూడాలని కోర్టుకు విన్నవించారు. ఇదిలా ఉంటే తమిళం నుంచి కన్నడ పుట్టిందని కమల్ హాసన్ వ్యాఖ్యానించినప్పుడు తాను చప్పట్లు కొట్టలేదని నటుడు శివరాజ్‌కుమార్ వివరణ ఇచ్చారు. అన్ని భాషలూ ముఖ్యమైనవేనని, తన మాతృభాష కన్నడకే ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. ఇందులో ఎలాంటి సందేహం లేదని ఇంతకు ముందే చెప్పానని అన్నారు. కన్నడ కోసం తన ప్రాణమైనా ఇస్తానని అన్నారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)



అంతర్రాష్ట్ర లింకు రోడ్డు చేపట్టాల్సిన ఉమ్రి గోగర్వడి రోడ్డు ఇదే..



అధ్వానంగా ఉన్న రోడ్డుపై ఎడ్లబండితో వ్యవసాయ పొలాలకు వెళ్తున్న రైతులు

హామీలకే పరిమితమైన
అంతర్రాష్ట్ర లింకు రోడ్డు నిర్మాణం!

● నిధులు మంజూరైనా ప్రారంభం కాని ఉమ్రి, గోగర్వడి రోడ్డు నిర్మాణ పనులు ● పట్టించుకోని అధికారులు

తలమడుగు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో నిర్మాణం చేపడుతామన్న అంతర్రాష్ట్ర లింకు రోడ్డు నిర్మాణం హామీలకే పరిమితమైంది. గత ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరైనా నేటికీ ప్రారంభింకపోవడంపై గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఉమ్రి గ్రామం నుంచి మహారాష్ట్ర గోగర్వడి వరకు రోడ్డు నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.4కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే నేటికీ పనులు ప్రారంభానికి నోచుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తలమడుగు మండలం ఉమ్రి గ్రామ మీదుగా మహారాష్ట్ర గోగర్ వాడి నుంచి కిన్వాట్ వరకు రోడ్డు నిర్మాణం చేపడితే తెలంగాణ మహారాష్ట్ర వాసులకు రావణ సౌకర్యం సులభంగా మారుతుంది. తెలంగాణ నుంచి మహారాష్ట్ర కిన్వర్ వరకు వెళ్లాలంటే దాదాపు 50కిలోమీటర్ల వరకు దూరం ఉంది. అయితే ఉమ్రి గ్రామం నుంచి రోడ్డు నిర్మాణం చేపడితే. 20 కిలోమీటర్లలోపు దగ్గరలో వస్తుంది. గతంలో రోడ్డు నిర్మాణం కోసం మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌బాబు రూ.4 కోట్ల రూపాయలను మంజూరు చేసి ఆ రోడ్డుకు గిరిజన నాయకుడైన పేందూరు లక్ష్మణరావు. పేరును సైతం నామకరణం చేసినప్పటికీ ఇప్పటివరకు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడం లేదు. దీంతో ఆదివాసి గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కొండపైన గిరిజన రైతుల వ్యవసాయ పొలాలు ఉండడంతో ఇటీవల రైతులందరూ కలిసి సమన్వయంతో రోడ్డు మరమ్మత్తు పనులు చేసుకున్నారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అయితే రైతుల పండించిన పంటలను మహారాష్ట్రకు తీసుకువెళ్లి తమకు గిట్టుబాటు ధరలకు విక్రయించుకునే అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నారు. రవాణా సౌకర్యం సులభంగా ఉంటుందని, ఆర్థిక సంబంధాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి త్వరగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం త్వరగా చేపట్టాలి



ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఉమ్రి నుంచి గోగర్వడి వరకు పెండింగ్‌లో ఉన్న అంతర్రాష్ట్ర రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. రోడ్డు నిర్మాణంతో రైతులు పండించిన పంటలను మహారాష్ట్రకు తీసుకెళ్లి అమ్ముకోవచ్చు. అంతేకాకుండా దూర భారం తగ్గుతుంది. గతంలో రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించారు.

● పెందూర్ విశ్వనాథ్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు

వడ్డీ వ్యాపారంపై పోలీసుల నిఘా

● నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై దాడులు

బోథ్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు వ్యతిరేకంగా, చట్ట విరుద్ధంగా వడ్డీ వ్యాపారం చేస్తున్న వారిపైన ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మండలంలో వడ్డీ వ్యాపారం చేస్తున్న వారిపై పోలీసులకు సమాచారం వెళ్లడంతో అకస్మిక దాడులకు పాల్పడుతున్నారు.

మండలకేంద్రంలో రెండుసార్లు దాడులు

మండల కేంద్రంలో నిబంధనలకు వ్యతిరేకంగా వడ్డీ వ్యాపారం చేస్తున్నవారి జాబితా జిల్లా అధికారులకు చేరడంతో నెలరోజుల వ్యవధిలోనే రెండుసార్లు వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు చేసి తనిఖీలు చేపట్టారు. వడ్డీ వ్యాపారం చేసే వారు అధిక వడ్డీ తీసుకుంటే చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే కొంతమంది అనుమతులు లేని వడ్డీవ్యాపారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడంతో పోలీసులకు వివరాలు తెలియకుండా జాగ్రత్త పడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. గతంలో దినసరి వడ్డీ వ్యాపారం చేసేవారిపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు.

అవసరానికి అప్పులు ఇచ్చి ఆందోళన

ఆర్థిక సమస్యలు, ఇబ్బందుల్లో ఉన్నామని కొంతమంది తమ అవసరాల కోసం అప్పు కోరితే ఇచ్చినందుకు తాము ఇబ్బందులు పడుతున్నామని డబ్బులు ఇచ్చినవారు ఆందోళన గురవుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా చిట్టీవ్యాపారం వడ్డీవ్యాపారం చేస్తున్నవారు ఆందోళనకు గురవుతున్నారు. వడ్డీ వ్యాపారం చట్టరీత్యా నేరం అనే విషయం తెలియకపోవడంతో వ్యాపారం చేసి కేసులు ఇరుక్కోవాల్సి వస్తుందన్న ఆందోళన నెలకొంది. అయితే పోలీసులు మాత్రం ఆర్‌బీఐ నిబంధన ప్రకారం వడ్డీ వ్యాపారం చేస్తే తాము వారిని ముట్టుకోవడం లేదని అంటున్నారు. ఇక వడ్డీ వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

ఎనిమిదో రోజుకు బుద్ధ-అంబేడ్కర్స్ ఐడల్ ప్రొటెక్షన్ కమిటీ రిలే దీక్షలు

భైంసా, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ముథోల్ మండలంలోని బోరిగాం గ్రామంలో తొలగించిన చోటే బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. బుద్ధ-అంబేడ్కర్స్ ఐడల్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భైంసాలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఫారూక్ అహ్మద్, జిల్లా ప్రతినిధులు మురళీగౌడ్, బాశెట్టి రాజన్నల నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించాయి. ఈ సందర్భంగా ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి బుద్ధ-అంబేడ్కర్ ఐడల్ ప్రొటెక్షన్ కమిటీ తమ డిమాండ్లను విన్నవించింది. సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశాయి. ఇందుకు స్పందించిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ప్రభుత్వం, జిల్లాఉన్నతాధికార యంత్రాంగందృష్టికి సమస్యను తీసుకెళ్లి సకాలంలో పరిష్కరింప చేసేందుకు గాను బాధ్యాతయుతతో కృషి చేస్తానన్నారు. అల్లర్లతో ప్రగతి నిలిచిపోవడమే కాకుండా ప్రశాంతత దూరమవుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు.



దీక్షా శిబిరంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నాయకులు

జేఈఈలో సత్తా చాటిన విద్యార్థి

● జాతీయస్థాయిలో 1221 ర్యాంకు



ఉత్తమ ర్యాంకు సాధించిన అశ్విత్‌ను అభినందిస్తున్న దృశ్యం

బాసర, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బాసర మండల కేంద్రానికి చెందిన బాహుజీ జ్ఞానేశ్వర్ పటేల్ కుమారుడు అశ్విత్ పటేల్ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో సత్తాచాటాడు. జాతీయ స్థాయిలో ఈడబ్ల్యూసీ కేటగిరిలో 1221 ర్యాంకు సాధించాడు. ఈ ర్యాంకుతో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ ఐఐటీలో సీటు ఖాయం చేసుకున్నాడు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన అశ్విత్ పటేల్ కష్టపడి రెండో ప్రయత్నంలో ఈ ర్యాంకు సాధించడంతో వివిధ పార్టీ నాయకులు అభినందించారు.

ఏరియా ఆసుపత్రిని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

భైంసా, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికా బద్ధమైన విధానాల ద్వారా ఆధునిక వసతులు, సౌకర్యాలను కల్పించి భైంసా ఏరియా ఆసుపత్రిని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. సోమవారం భైంసా ఏరియా ఆసుపత్రికి తమ మిత్రుల సహకారంతో రూ.10లక్షల విలువ గల 25 ఆధునాతన ఐసీయూ బెడ్‌లను విరాళంగా అందించిన సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాలకు ప్రధానమైన ఇక్కడి ఏరియా ఆసుపత్రిలో రోగులకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో తెచ్చేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తున్నామన్నారు. వైద్యాధికారులతో పాటు సిబ్బంది అన్నివేళలా అందుబాటులో ఉండి రోగులకు సకాలంలో మెరుగైన రీతిలో చికిత్సలు అందించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఖాళీగానున్న వైద్యాధికారుల పోస్టుల భర్తీకి పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. గతంలో పది మంది వైద్యాధికారులకే పరిమితమైన ఏరియా ఆసుపత్రి ప్రస్తుతం పాతిక మందికి పైగా సేవలందించే స్థితికి తీసుకవెళ్లామన్నారు. గత సంవత్సరం తమ కుటుంబ సభ్యులు ఆసుపత్రికి అవసరమైన ఆధునాతన పడకలు సమకూర్చగా, ప్రస్తుతం తమ మిత్రుడు ఒకరు సైతం ముందుకు వచ్చి రూ.10లక్షలకు పైగా విలువ చేసే పడకలను విరాళంగా అందించారన్నారు. ఇందులో భైంసా ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డా. కాశీనాథ్, బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షులు రావుల రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లేశ్వర్, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, బీజేపీ ప్రతినిధులు తూమోల్ల దత్తాత్రి, న్యామత్‌కర్ లింగోజీ, బీజేవైఎం డివిజన్ ప్రతినిధి గంగాప్రసాద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



బెడ్‌లను పరిశీలిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామరావ్

చెట్లు నరికిన వారిపై చర్యలు తప్పవు

● ఎంపీడీవో రాధా రాథోడ్ ● హరితహారం చెట్ల నరికివేతపై అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు

లక్ష్మణచాంద, జూన్2 (ఆంధ్రజ్యోతి): హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను తొలగించిన వారిపై చర్యలు తప్పవని ఎంపీడీవో రాధా రాథోడ్ అన్నారు. మండలంలోని లక్ష్మణచాంద - చామన్‌పెల్లి గ్రామాల మధ్యగల తారు రోడ్డుకు ఇరువైపులా హరితహారం మొక్కలు నాటి సంరక్షణ చేపడుతున్నారు. అయితే కొందరు వ్యక్తులు ఏపుగా పెరిగిన ఆ మొక్కలను నరికి వేయటంపై ఎంపీడీవో రాధా రాథోడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చెట్లను నరివేశారన్న విషయం తెలుసుకున్న ఎంపీడీవో సోమవారం తొలగించిన చెట్లను పరిశీలించారు. బాధ్యులపై చర్యలు తీసుకునే విధంగా పై అధికారులకు నివేదిక పంపామని, అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. చెట్లను నరికితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఈ సందర్భంగా హెచ్చరించారు.



చెట్లను తొలగించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో



రోడ్డు పక్కనే తొలగించిన చెట్లు



మల్చింగ్ చాళ్ల నడుమ రైతు

నీటిలో దుక్కి కాదు
టమాట.. మల్చింగ్‌లోనే..!



ఈ చేనులో రైతు నీళ్లలోనే అరకతో దుక్కి చేస్తున్నాడను కుంటే పొరపాటే. టమాట సీడ్ వేసి తర్వాత మల్చింగ్ చాళ్లనడుమ కలుపు గడ్డి కాకుండా దుక్కి చేస్తున్న నీడలా కూడా కనిపిస్తోంది. దూరం నుంచి చూస్తే ఇది నీటిలో దుక్కి చేస్తున్నట్లు కనిపిస్తున్నది. దగ్గరి నుంచి చూస్తే చాళ్ల నడుమ అరక కనిపిస్తోంది. తలమడుగు శివారులో 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కిన దృశ్యాలివి.

● (ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)



మల్చింగ్ చాళ్ల నడుమ దుక్కి చేస్తున్న రైతు



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న ప్రభుత్వ సలహాదారు, కలెక్టర్, ఎస్పీ



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ





రైతులకు కందిసీడ్స్ ప్యాకెట్లను అందిస్తున్న ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే, కలెక్టర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్‌లో జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్‌అలీ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరుల స్తూపం వద్ద అమరులకు నివాళులర్పించారు. అలాగే నిర్మల్‌లో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



నిర్మల్‌లో ప్రసంగిస్తున్న రాజయ్య




నిర్మల్‌లో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా..



జెండా వందనం చేస్తున్న చైర్మన్ రాజయ్య, నిర్మల్ కలెక్టర్, జిల్లా అధికారులు

andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.3। కనిష్ఠం 27.2
ఆంధ్రజ్యోతి
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
1
మంగళవారం 3 జూన్ 2025





మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ



● టోల్‌ప్లాజా వద్ద పోలీసుల బందోబస్తు



- జిల్లా మీదుగా పశువుల అక్రమ రవాణాకు ఎక్కడికక్కడ చెక్ పెడుతున్న పోలీసులు
- రైతులకు డబ్బు ఆశ చూపి పశువులను కొనుగోలు చేస్తున్న దళారులు
- జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా
- పశువుల పోషణపై చేతులెత్తేస్తున్న గోశాల నిర్వాహకులు
- కబేళాలకు తరలించకుండా అడ్డుకుంటున్న అధికారులు

పశువుల అక్రమ రవాణాపై.. కొరడా

ఆదిలాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా మీదుగా ఇతర రాష్ట్రాలకు అక్రమ మార్గంలో పశువులను తరలించకుండా జిల్లా పోలీసులు చెక్‌పెడుతున్నారు. జిల్లాలో గడిచినా నెల రోజుల్లోనే 104 పశువులను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. దీంతో పలువురిపై 9 కేసులు నమోదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా పశువులను తరలిస్తున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. గతంలో కొన్ని హిందూ సంఘాల ఆధ్వర్యంలో పశువులను పట్టుకొని పోలీసులకు అప్పగించే వారు. ప్రస్తుతం పోలీసులే రంగంలోకి దిగి కొరడా ఝులిపించడంతో పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుంది. జిల్లా మీదుగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో పాటు హైదరాబాద్ లాంటి పట్టణాలకు భారీ వాహనాలలో ఇబ్బందికరంగా పశువులను తరలిస్తు అమ్మేసుకుంటున్నారు. అయితే పోలీసులు ఎంత కట్టడి చేస్తున్నా.. ఎవరికీ అనుమానం రాకుండా అడ్డదారుల్లో రాత్రికి రాత్రే తరలిస్తున్నారు. భారీ కంటైనర్, డీసీఎం ఐచర్ వాహనాలలో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసుకుంటూ దళారులు వివిధ రకాల ఎత్తుగడలను వేస్తున్నట్లు తెలుస్తుంది.

వదిలించుకుంటున్న రైతులు

దళారులు డబ్బులను ఆశ చూపడంతో రైతులు పశువులను వదిలించుకుంటున్నారు. ముఖ్యంగా వానాకాలం సీజన్ ప్రారంభం కావడం తో కొంత మంది రైతులు పెట్టుబడి ఖర్చులు, వివిధ రకాల అవసరాల కోసం పశువులను అమ్మేస్తున్నారు. అలాగే వయస్సు పైబడిన పశువులను పోషించే స్థోమత లేక రైతులే దళారులకు పశువులను అంటగడుతూ చేతులు దులుపుకుంటున్నారు. కొంత మంది రైతులైతే పశువులపై ఎనలేని ప్రేమను చూపుతూ మరణించిన తర్వాత పూడ్చి వేస్తున్నారు. అయితే నిబంధనల ప్రకారం వయస్సు పైబడిన ఎద్దులను మాత్రమే కొనుగోలు చేసి కబేళాలకు తరలిస్తే పశువైద్యాధికారి నిర్ధారణ పత్రంతో పాటు సంబంధిత కొనుగోలు పత్రాలను అధికారులకు చూపించాల్సి ఉంటుంది. గ్రామాల్లో తమ ప్రతినిధుల సహాయంతో దళారులు రైతుల వద్దకు వెళ్లి మాయమాటలు చెబుతు పశువులను కొనుగోలు చేస్తున్నారు.



● పశువులను తరలిస్తున్న వారిని పట్టుకున్న పోలీసులు (ఫైల్)

గోవులను వధించడం చట్టరీత్యా నేరం
: జీవన్‌రెడ్డి, డీఎస్పీ ఆదిలాబాద్

ఎలాంటి కారణం చేతనైనా గోవులను వధించడం చట్టరీత్యా నేరం. గోవధకు పాల్పడితే చర్యలు తప్పవు. వయస్సుకు పైబడిన ఎద్దులను మాత్రమే కొనుగోలు చేయాలి. అలాగే సంబంధిత పశువైద్యాధికారి ధ్రువీకరణ తప్పనిసరి. నిబంధనల ప్రకారమే పశువులను వాహనాలలో తరలించాలి. జిల్లా మీదుగా అక్రమంగా తరలిస్తున్న పశువులను అడ్డుకొని వ్యాపారులపై కేసులు నమోదు చేస్తున్నాం.

ముమ్మరంగా తనిఖీలు

జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద అధికారులు ముమ్మరంగా తనిఖీలను నిర్వహిస్తున్నారు. జిల్లా మీదుగా వెళ్లే 44వ జాతీయ రహదారి వాహనాలపై ప్రత్యేక నిఘాను సారిస్తున్నారు. సరిహద్దు రహదారులపై మొత్తం 8 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. నేరడిగొండ మండలం రోల్‌మామడ, జైనథ్ మండలం పిప్పర్‌వాడ, ఆనంద్‌పూర్, బేల మండలం శంకర్‌గూడ, గాదిగూడ, బోథ్ మండలం ఘన్‌పూర్, తలమడుగు మండలం లక్ష్మీపూర్, ఉట్నూర్ మండలం కొత్తగూడ గ్రామాల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీసులు, పశువైద్యాధికారులను ప్రత్యేక బృందాలుగా నియమించారు. సరిహద్దుల్లో కట్టుదిట్టమైన

(తరువాయి 2వ పేజీలో...)

ఎందరో అమరవీరుల త్యాగ ఫలం

● అమరుల స్తూపం వద్ద నివాళులర్పించిన ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, కలెక్టర్, ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 2: ఎన్నో ఏళ్లుగా స్వరాష్ట్రం కోసం పోరాటాలు జరిగాయని, ఎందరో అమరవీరుల త్యాగ ఫలమే తెలంగాణ అని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని అమరవీరుల స్తూపం, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరణ చేశారు. అమరుల స్తూపం వద్ద అమరులకు నివాళులర్పించారు. అనంతరం మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా స్వరాష్ట్రం కోసం పోరాటాలు జరిగాయని, ఎందరో అమరవీరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ.. ఈ రోజు అన్ని రంగాల్లో దశ దిశల వెలుగులు విరజిమ్ముతుందన్నారు. తెలంగాణలో ప్రజాపాలన సాగుతుందని, తెలంగాణను దేశంలోనే, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

● **ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం**

రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఇందులో ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే వంట గ్యాస్ సరఫరా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలతో పాటు సంపన్నులతో సమానంగా తెలంగాణ మహిళలతో విద్యుత్ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

● **రైతులను రుణవిముక్తి చేయడమే లక్ష్యం**

అధికారంలోకి వచ్చిన కేవలం 8నెలల కాలంలో 25 లక్షల 35వేల 964 మంది రైతులను రుణ విముక్తులను చేయడంతో పాటు రూ.20,617 కోట్ల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. రైతుకు పెట్టుబడి సాయం పెంచి రైతుభరోసా పథకం కింద ఎకరానికి రూ.12వేల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తూ ధాన్యం కొనుగోలు చేసిన 24గంటల్లో రైతుల ఖాతాల్లో నగదును జమ చేయడం జరుగుతుందన్నారు. అలాగే, యువతకు ఉపాధి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. అంతేకాకుండా భూభారతి పోర్టల్‌పై జిల్లాలోని అన్ని మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే, జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజల రక్షణకు అహర్నిశలు కృషి చేస్తోందని, 'ఆపరేషన్ చబుత్ర' ప్రారంభించడం జరిగిందన్నారు. కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే పాయల శంకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీలు సురేందర్‌రావు, కాజల్‌సింగ్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడే గజేందర్, బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎస్పీ

తెలంగాణ రాష్ట్రం సిద్ధించడంలో ప్రతీఒక్కరి పాత్ర కీలకం : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంతో పాటు పోలీసు సాయుధ ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సిబ్బంది సమక్షంలో త్రివర్ణ పతకాన్ని ఆవిష్కరించి రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.రు. ముందుగా రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ ఆధ్వర్యంలోని బృందం జిల్లా ఎస్పీకి గౌరవ వందనాన్ని సమర్పించారు. అనంతరం జాతిపిత మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడారు. ఇందులో అదనపు ఎస్పీ బి.సురేంద్‌రావు, ఏఎస్పీ ఉట్నూర్ కాజల్‌సింగ్ ఐపీఎస్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, సీహెచ్ నాగేందర్, ఇన్‌స్పెక్టర్లు బి.సునిల్‌కుమార్, సీహెచ్ కరుణాకర్‌రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకటి, టి.మురళీ, బి.శ్రీపాల్, ఎన్.చంద్రశేఖర్, రిజర్వ్ సిబ్బంది పాల్గొన్నారు.

● **సర్కిల్ కార్యాలయంలో అవతరణ వేడుకలు**

ఆదిలాబాద్ అర్బన్: తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను ఆదిలాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ సర్కిల్ ఆఫీస్‌లో సీఈ కన్‌స్ట్రక్షన్, ఇన్‌చార్జీ ఎస్ఈ ఆపరేషన్ ఆదిలాబాద్ జేఆర్ చౌహాన్ జాతీయ జెండాని ఎగుర వేశారు. ఇందులో డీఈ ఎంఆర్‌టీ, ఈఈ సివిల్, ఎస్ఏవో, ఏడీఈ టెక్నికల్, ఏఈలు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ డీఎస్సీని ప్రకటించాలి

● ఐటీడీఏ పీవోకు గిరిజన నిరుద్యోగుల వినతి

ఉట్నూర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): 'ఏజెన్సీ ప్రాంతంలో గత 12 ఏళ్ల నుంచి ఏజెన్సీ ప్రాంతంలో ఎలాంటి నోటిఫికేషన్లు లేకుండా గత ప్రభుత్వం కాలయాపన చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిరుద్యోగులకు నిరాశ పరుస్తోందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ సోమేశ్, కార్యదర్శి కొచ్చెరా కిషోర్‌లు అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో పీవోని కలిసి వినతిపత్రం అందించామన్నారు. అనంతరం వారు మాట్లా డుతూ ఏజెన్సీ ప్రాంతంలో డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్రం జాలీంసవు, మనోహార్, ధనరాజ్, తదితరులు నిరుద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

ఉట్నూర్, జూన్2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు ప్రారంభిస్తామని ఇన్‌చార్జీ తహసీల్దార్ జాదవ్ అమృత్‌లాల్ తెలిపారు. మంగళవారం మండలంలోని గంగాపూర్, అందోలి, సాకేర గ్రామాలలో రెవెన్యూ సదస్సులు ఉంటాయని, ప్రజలు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

నేరడిగొండ: రెవెన్యూ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కలీం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఏఈవో, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

విద్యా, వైద్య రంగం అభివృద్ధికి కృషి

● పీవో ఖుష్బుగుప్తా ● అటవీ శాఖ అడ్డంకులతోనే సౌర గిరిజల వికాసం : ఎమ్మెల్యే బొజ్జు ● జిల్లాలో ఘనంగా అవతరణ దినోత్సవ వేడుకలు

ఉట్నూర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన విద్యా, వైద్య రంగం అభివృద్ధి కోసం కృషి చేయడం జరుగుతుందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రలోని ఐటీడీఏ ప్రధాన కార్యాలయం ఆవరణలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐటీడీఏ ప్రమాణంలో జాతీయ జెండాను ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ నాయకులు, తెలంగాణ సిద్ధాంతకర్తల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనాన్ని ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఖుష్బుగుప్తా మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో 920 ప్రాథమిక పాఠశాలలు పని చేస్తుండగా 12408 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. అదే విధంగా 133 ఆశ్రమ పాఠశాలల్లో 31771 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షలో 96.44 శాతం ఉత్తీర్ణత సాధించడంక జరిగిందన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం ద్వారా 786 గిరిజన పాఠశాలలకు మరమ్మత్తులు చేపట్టామన్నారు. గిరిజన పోషణ మిత్ర పథకాన్ని ప్రారంభించి 76 బాలికల ఆశ్రమ పాఠశాలలో రక్తలేమిని అధిగమించడానికి వారానికి రెండు రోజులతో పాటు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రం అందిస్తున్నామని పలు అంశాలపై వివరించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులకు సాగునీరు అందించడానికి త్రీఫేస్ కరెంట్ సౌకర్యం కల్పించాలని భావించగా.. అటవీ శాఖ అడ్డంకులు తెలపడంతో ప్రభుత్వం మంత్రివర్గ సమాలోచనలు జరిపి ఇందిరా సౌర గిరిజల వికాసం కార్యక్రమాన్ని రూపొందించిందని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు గాను రూ.171.30కోట్లతో 2855 యూనిట్లు మంజూరు చేయడం జరిగిందని, ఒక్కొక్క యూనిట్‌కు ఆరు లక్షల రూపాయలు కేటాయించడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ జాదవ్ వసంత్‌రావు, ఇన్‌చార్జీ డీడీ జాదవ్ అంబాజి, ఈఈ జాదవ్‌తానాజి, ఏపీఓ పీవీటీజీ మేస్రం మనోహార్, పరిపాలన అధికారి దామోదరస్వామి, మేనేజర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

అలాగే, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్‌లో స్వామి వివేకానంద యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో వేములవాడ సీనియర్ సివిల్ న్యాయాధికారి అజయ్‌కుమార్ జాదవ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు ఉంటేనే కాలుష్యాన్ని తరిమికొట్టవచ్చని మొక్కలే మనకు జీవనాధారం అన్నారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన స్వామి వివేకానంద యూత్ సభ్యులను అభినందించారు.

● **కేసీఆర్ పోరాట ఫలితం : బోథ్ ఎమ్మెల్యే అనిల్**

బోథ్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి పోరాటం చేశారన్నారు. తెలంగాణ వచ్చుడు అన్న నినాదంతో 2001లో టీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేసి యుద్ధ భేరి మోగించారన్నారు. 14ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో టీఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఏకం చేసి రాష్ట్రం సాధనకు సుదీర్ఘ పోరాటం చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తర్వాత ముఖ్యమంత్రిగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని వెనక్కు నెట్టుతుందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను దెబ్బతీసే విధంగా వివరిస్తున్న ఆ పార్టీకి తగు గుణపాఠం చెప్తామన్నారు.

అలాగే, మండలంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని బోథ్ కోర్టు ఆవరణలో మేజిస్ట్రేట్‌కి వి.కిరణ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కాగా, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుభాష్ చంద్ర, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమేష్, మార్కెట్ కమిటీలు చైర్మన్ బి.గంగారెడ్డి, ప్రత్యేక కార్యదర్శి విట్టల్, సహకార సంఘం కార్యాలయంలో సీఈవో గోలి స్వామి, తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల వ్యాప్తంగా సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఇచ్చోడ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆయా కార్యాలయాల బాధ్యులు ఎగురవేశారు. ఇచ్చోడ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ లక్ష్మణ్ జెండాను ఆవిష్కరించారు. ఇందులో బీఆర్ఎస్ కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచి సునీత, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తలమడుగు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, వ్యవసాయ కార్యాలయం, సహకార సంఘం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలలో జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాలాపనతో పాటు తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, మండల విద్యాధికారి వెంకట్రావు, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి, సహకార సంఘం వైస్ చైర్మన్ పద్మాకర్ రెడ్డి, సీఈఓ శ్రీనివాస్, ఐకెపి ఎపిఎం చంద్రశేఖర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు హరీష్, పశు వైద్యాధికారి డాక్టర్ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఇందులో ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్.భాగ్యలక్ష్మి, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్‌హై, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో రమేష్, పశు వైద్యశాలలో డా.శ్రీకాంత్, పీహెచ్‌సీలో డా. శ్యామ్‌సుందర్, పీఏసిఎస్‌లో చైర్మన్ సంజీవ్‌లు పాల్గొన్నారు.

భీంపూర్: మండలంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీలార్ కార్యాలయంలో తహసీల్దార్ నలంద ప్రియ, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో గోపాల కృష్ణారెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ నిఖిల్ రాజ్, ఏడీసీసీ బ్యాంక్‌లో మేనేజర్ పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: అమరుల త్యాగ ఫలంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని తహసీల్దార్ కలీం అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా సోమవారం జాతీయ జెండా ఆవిష్కరించారు. ఎంపీడీవో రాజ్ వీర్, డీటీ మహేష్, సీనియర్ అసిస్టెంట్ మీరాబాయి, ఎంఆర్ఐ నాగోరావ్, నాయకులు ఆడే వసంత్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్: జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్,సాత్నాలతో పాటు మండల కేంద్రమైన జైనథ్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అలాగే, ఇంద్రవెల్లి, సోనాల, బేలతో పాటు ఆయా మండలాల్లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



ఇచ్చోడ ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్



..గుడిహత్నూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి తహసీల్దార్ భాగ్యలక్ష్మి



జైనథ్‌లో జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న అధికారులు, నాయకులు



● ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న పీవో, ఎమ్మెల్యే, అధికారులు



.. బోథ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

రెవెన్యూ సదస్సులను జయప్రదం చేయాలి

ఇంద్రవెల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మంగళవారం నుంచి గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న మంగళవారం ధన్నోర్ (బి), ఏమైయికుంట, 4వ తేదిన కేస్లాగూడ, దేవాపూర్, 5న హీరాపూర్, పిప్రి, 6న గౌరాపూర్, ఇంద్రవెల్లి (కె), 9న హర్కాపూర్, తేజాపూర్, 10న దన్నోర్ (కె), అంజి, మామిడిగూడ, 11న వడ్‌గామ్, మెండపల్లి, 12న ముత్నూర్, వాల్గొండ, హీరాపూర్, 13న దోడంద, గిన్నెరా, 16న గట్టేపల్లి, కేస్లాపూర్, 17న దస్నాపూర్, బర్సన్ పటార్, 18న ఇంద్రవెల్లి (బి), జోంగర్‌గావ్, 19న మల్లాపూర్, 20న ధర్మాసాగర్ గ్రామాల్లో నిర్వహిస్తామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి : పాయల

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రైతులు ప్రకృతి పంట నష్టం, నాసిరకం విత్తనాలతో మోసపోయిన సందర్భంలో ప్రభుత్వం కూడా ఆదుకునేలా కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం తరపున పంపిణీ చేస్తున్న కందుల సీడ్స్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు కందుల సీడ్స్ ప్యాకెట్లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నకిలీ విత్తనాలను అరికట్టాలని అధికారులకు సూచించారు. పెట్టిన పెట్టుబడులకు దిగుబడులు రాకపోతే రైతులు పడే నరకయాతన అంత ఇంత కాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలకే పరిమితమైన అంతర్ రాష్ట్ర లింకు రోడ్డు నిర్మాణం!

● నిధులు మంజూరైనా.. ప్రారంభం కాని ఉమ్రి, గోగర్వాడి రోడ్డు నిర్మాణ పనులు
● పట్టించుకోని అధికారులు



వివరాలు 5వ పేజీలో...